ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పశ్చిమప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమమవుతోంది. ఆదిశగా చకచకా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ నుంచి జిల్లాస్థాయి వరకు సరిహద్దుల మార్పు, ఇతర అంశాలపై అధ్యయనానికి నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు బుధవారం అమరావతిలోని సచివాలయంలో సమావేశమై చర్చించారు. వారిని జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి కలిసి మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఇటీవల ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలు, తాజా పరిణామాలు పశ్చిమప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

మార్కాపురం జిల్లాకు
మార్గం సుగమం

టీడీపీ కీలక హామీ అమలు దిశగా అడుగులు
సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం
రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా అంశాలపై కసరత్తు

- ప్రజల నుంచి వినతుల స్వీకరణకు నిర్ణయం
- నేటి నుంచి కలెక్టర్‌కూ ఇచ్చే వెసులుబాటు
- వచ్చేనెల 2 దాకా అవకాశం కల్పించిన ప్రభుత్వం
- ఉపసంఘ సభ్యులను కలిసిన మంత్రి స్వామి
- మార్కాపురం జిల్లా, కొండపి నియోజకవర్గంలో లోపాలపై చర్చ


సచివాలయంలో మంత్రులు అనగాని, అనిత, బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడుతున్న స్వామి

ఒంగోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సుదూరంగా ఉన్న మార్కాపురం డివిజన్ ప్రజలు పనుల కోసం ఇక్కడికి వచ్చేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన సమయంలో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కోరుతూ ఆప్రాంత ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. వారి మనోభావాలను నాటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఒంగోలుకు 35నుంచి 45 కి.మీ దూరంలో ఉన్న అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ఇతర జిల్లాల్లో కలిపి 100నుంచి 150 కి.మీ దూరంలో ఉండే పశ్చిమప్రాంతాన్ని ప్రకాశంలోనే ఉంచింది. దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఈనేపథ్యంలో గత ఎన్నికలకు ముందు పర్యటన సందర్భంగా చంద్రబాబు నాయుడు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటును టీడీపీ విధాన నిర్ణయంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక సీఎం హోదాలోనూ దానిపై స్పష్టత ఇచ్చారు. పలు సందర్భాల్లో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఇతర అధికార టీడీపీ ప్రజాప్రతినిధులంతా జిల్లా ఏర్పాటు ఖాయమని చెప్తూ వస్తున్నారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుతో ఆశలు

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ స్థాయి నుంచి జిల్లాల వరకు అవసరమైన మార్పులు, చేర్పుల ప్రతిపాదనలపై అధ్యయనం చేసేందుకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం కొంత కాలం క్రితం నియమించింది. దీంతో పశ్చిమ ప్రజల్లో ఆశలు చిగురించాయి. వారం క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో

మిగతా 6లో...



దోర్నాల మండలం దొంగలవాగు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

వర్షాతిరేకం

తూర్పున ముంచెత్తి... పశ్చిమాన పరుగులు

- జిల్లావ్యాప్తంగా వానలు
- ఒంగోలు పరిసరాల్లో కుండపోత
- 28.6 మి.మీ సగటు వర్షపాతం
- గుండ్లకమ్మ మూడు గేట్లు ఎత్తివేత
- మరో మూడు రోజులు వర్షాలు
- యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు
- 1077 నంబర్ కేటాయింపు

ఒంగోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలోని ఒంగోలు పరిసర మండలాల్లో దంచికొట్టింది. పశ్చిమాన నల్లమల అటవీ ప్రాంతంలో భారీగా పడింది. దీంతో కొన్నిచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ నుంచి భారీగా నీరు వస్తుండటంతో మూడుగేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. వర్షాలు మరో మూడు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మండల స్థాయి అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. తాజా వర్షాలపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అటు ఎండల నుంచి ఉపశమనం లభించగా, ఇటు ఖరీఫ్ సాగుపై మోడువారుతున్న ఆశలను చిగురింపజేసింది.


నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

అత్యధికంగా మద్దిపాడులో 19 మి.మీ వర్షపాతం

జిల్లాలో సాధారణంగా ఈనెలలో వర్షాలు కురుస్తాయి. అయితే దాదాపు నెలన్నరగా వాన జాడలేదు. అడపాదడపా జల్లులు పడినా పెద్దగా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో మంగళవారం రాత్రి జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఒంగోలు పరిసరాల్లో దంచికొట్టింది. బుధవారం తెల్లవారుజాము వరకూ ఈ ప్రాంతంలో జల్లులు పడుతూనే ఉన్నాయి. ఈనెలలో సాధారణ వర్షపాతం 92.0 మి.మీ కాగా.. ఇప్పటి వరకూ 67.10 మి.మీ కురిసింది. అందులో

మిగతా 6లో...



ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అధికారులకు సూచనలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

- పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ
- అధికారులకు సూచనలు

ఒంగోలు (రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ఇందుకు ముస్తాబు చేస్తున్నారు. జేసీ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. అక్కడే అధికారులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. శాఖల వారీ బాధ్యతలు అప్పగించారు. పోలీసుల కవాతు, గౌరవవందనం తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఆహ్వానం, వారికి సీటింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోపం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శకటాల ప్రదర్శన, వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు గురించి తెలుసుకున్నారు. వేడుకలకు వచ్చే వారికి తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌వో చినఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తదితరులు ఉన్నారు.


కాలువ కట్టపై ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

ఆధునికీకరణకు ఆటంకం

- నత్తనడకన సాగర్ కాలువల అభివృద్ధి పనులు
- చీమకుర్తి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో రూ.5కోట్లు మంజూరు
- పలు మేజర్లలో ప్రారంభం కాని పనులు
- ఓబీసీపై ఆక్రమణలతో ముందుకు సాగని వైనం

7



రైతు సంబరాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తి మండలం పల్లామల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. దాదాపు వంద ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. అగ్రభాగాన ఎడ్ల బండిపై ఎక్కి ఎమ్మెల్యే ప్రత్యేక ఆకర్షణ నిలిచారు.

6

వచ్చే నెల నుంచి నూతన విధానం

బార్లకూ లాటరీ!

- నోటిఫికేషన్ విడుదల
- గీత కార్మికులకు మూడు కేటాయింపు
- దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు



ఒంగోలు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బార్ల నిర్వాహకుల ఇష్టారాజ్యానికి చెక్ పడనుంది. వచ్చేనెల 1 నుంచి నూతన బార్ల విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తోంది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం రాత్రి విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 25 బార్లు ఉండగా వీటిలో మూడు (10 శాతం) గీత కార్మికులకు ఇవ్వనుంది. నూతన విధానంలో లాటరీ పద్ధతిలో బార్లను కేటాయించనుంది. జనాభా ప్రాతిపదికన బార్ల లైసెన్స్ ఫీజును నిర్ణయించింది. ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు

మిగతా 6లో...



పైసా పోలీస్!

అధికార పార్టీకి అనుకూలంగానో, ప్రతిపక్ష పార్టీకి మద్దతుగానో పనిచేస్తున్నారని పోలీసులపై ఇప్పుడు చాలాచోట్ల ఫిర్యాదులు రావడం పరిపాటిగా మారింది. కానీ ఈ ఎస్‌ఐకి పార్టీలతో సంబంధం లేదు. పైసలిస్తే చాలు.. ఎంతటి పనైనా అయిపోతుంది. అది సివిల్ అయినా సెటిల్ చేసేస్తున్నారు. ఈయనపై ఇప్పుడు బాధితులు జిల్లా కేంద్రం ఒంగోలులో జరిగే ఎస్పీ గ్రీవెన్స్‌కు క్యూ కడుతున్నారు. ఆధారాలతో వెళ్తున్నవారు తమకు రక్షణ కావాలని, తమ వద్ద బలవంతంగా రాయించుకున్న ప్రామిసరీ నోట్లు, తెల్లకాగితాలపై సంతకాల లేఖలు ఇప్పించి ఆదుకోండి అని వేడుకొంటున్నారు. ఆ ఎస్‌ఐ ఎవరో.. ఆ కథేంటో తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే.

- ఇచ్చట అన్నిరకాల సెటిల్మెంట్లు చేయబడును
- పంచాయితీ తీసుకొస్తే పంచుకుందాం
- ఆ ఎస్‌ఐపై ఎస్పీ గ్రీవెన్స్‌కు క్యూ కడుతున్న బాధితులు
- మితిమీరిన ఆగడాలపై టీడీపీ ఇన్‌చార్జి వద్దకు నేతలు

త్రిపురాంతకం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం సర్కిల్ పరిధిలోని ఒక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. అగ్నికి గాలి తోడైనట్టు ఇతనికి ఒక 'వ్యాపారి' కలిశాడు. ఆ వ్యాపారి అప్పు వసూలుకు ఇదే అదునుగా భావించాడు. ఇద్దరూ కలిసి రెట్టింపు ఆదాయం పొందేందుకు అడ్డదారులు తొక్కారు. వ్యాపారికి అప్పు ఇవ్వాల్సిన వారిని స్టేషన్‌కు తీసుకురావడం, బెదిరించి రావాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో రాబట్టుకోవడం ప్రారంభించారు. అందులో ఎస్‌ఐకు వాటానే కాకుండా ఉన్నతాధికారులకు కూడా వాటా లేదా అప్పుగా నగదు ఇచ్చానని ఆ వ్యాపారి బహిరంగంగా చెప్పుకోవడం ప్రారంభించారు. వీరిద్దరి ఆగడాలు భరించలేని బాధితులు ఇప్పుడు ఒంగోలు వెళ్లి ఎస్పీ వద్ద క్యూ కడుతున్నారు.

ఇవిగో నిదర్శనాలు..

- తెల్లగట్ల గ్రామానికి చెందిన దళితుడు 'వ్యాపారి'కి రూ.5లక్షలు అప్పుగా ఉన్నారు. తనకు ఆర్థికంగా వెసులుబాటు కాగానే ఇస్తానని చెప్తున్నప్పటికీ ఎస్సై వద్దకు అతనిని పిలిపించి బెదిరించినట్లు చెప్తున్నారు. బాధితుడు గతనెల 22న ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఇక్కడ జరుగుతున్న విషయం ఫిర్యాదు చేయగా దానిని విచారించమని ఎర్రగొండపాలెం సీఐకి పంపారు. ఆయన వద్దకు వచ్చిన బాధితుడితో సీఐ ఈ వివాదాన్ని ఎస్సై వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చి పంపినట్లు బాధితుడు తెలిపాడు. అంతే ఎస్‌ఐ ఒక్కసారిగా ఉగ్రుడై బాధితుని మెడలు వంచి అతని కాళ్లపై బూటుకాళ్లు ఉంచి బాకీ ఇస్తావా? చస్తావా అని బెదిరించడంతోపాటు అప్పు రూ.5లక్షలు కాదు వడ్డీతో ఇప్పటికి రూ.15 లక్షలయిందని లెక్కకట్టారు. ఇక చేసేదేమీ లేక బాధితుడు పుల్లలచెరువులో నివాసం కోసం కట్టుకున్న ఇంటిని వ్యాపారికి స్వాధీనం చేస్తూ కాగితాలు రాసి సెటిల్మెంట్ చేశారు.
- ఎర్రగొండపాలెం మండలం కొలుకులకు చెందిన వ్యాపారి ఎక్కలి అప్పారావు

మిగతా 6లో...

ఎఫ్‌ఏ-1 ప్రశ్నపత్రాల్లో గందరగోళం

- సిలబస్‌లో లేని ప్రశ్నలతో విద్యార్థుల బెంబేలు
- టీచర్లు గరంగరం



ఒంగోలు విద్య, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వరంగ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ-1) పరీక్షల ప్రశ్నపత్రాలు గందరగోళంగా మారాయి. సిలబస్‌లో లేని ప్రశ్నలు రావడంతో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రశ్నపత్రాల తీరుపై ఉపాధ్యాయులు గరంగరం అవుతున్నారు. ప్రాథమిక స్థాయిలో పరిస్థితి మరీదారుణంగా ఉంది. 1వ తరగతి విద్యార్థులకు అక్షరాలు రావడమే అంతంతమాత్రమైతే వారికి ఇంగ్లీషు వాక్యాలు ఇవ్వడంతో తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎఫ్‌ఏ-1 ప్రశ్నపత్రాలను ఆయా తరగతులు బోధించే టీచర్లు స్వయంగా తయారు చేసి పరీక్షలు నిర్వహించే వారు. గత ప్రభుత్వం ఈ సంప్రదాయానికి చెల్లుచీటి ఇచ్చింది. పరీక్షల నిర్వహణను క్లిష్టతరం చేసింది. ఎస్‌సీఈఆర్టీతో ప్రశ్నపత్రాలు ఇచ్చే విధానాన్ని అమలు చేసింది. దాన్నే ప్రజా ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షల సిలబస్‌కు ప్రశ్నపత్రాల్లో వచ్చిన ప్రశ్నలకు పొంతన లేదు. అన్ని తరగతులకు జూలై 31నాటి సిలబస్‌లో ప్రశ్నలు మాత్రమే ఉండాలి. అయితే ఆగస్టు, సెప్టెంబరు నెలల సిలబస్ నుంచి కూడా ప్రశ్నలు ఇచ్చారు. ఇలా అన్ని తరగతులకు గందరగోళంగా ప్రశ్నలు ఉండటంతో విద్యార్థులు సమాధానాలు రాయలేకపోతున్నారు. ఎఫ్‌ఏ-1 పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలపై టీచర్లు మండిపడుతున్నాయి. పరీక్షలు అనేవి విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వివిధ ప్రశ్నల ద్వారా అంచనా వేసే విధంగా ఉండాలే తప్ప భయపెట్టేలా ఉండకూడదంటున్నారు. ఇలా చేయడం ఎంత వరకు సబబు అని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్విట్ కార్పొరేషన్- క్విట్ అగ్రికల్చర్
ర్యాలీ అడ్డగింత

- ముందస్తు అనుమతి లేకపోవడంపై పోలీసుల ఆగ్రహం
- అక్కడే నిరసన తెలిపిన రైతు సంఘాల నాయకులు

7

రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులకు
14 దరఖాస్తులు

7

రూ.20 లక్షల టర్నోవర్ దాటితే
జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

పైసా వసూల్

(5వపేజీ తరువాయి)

తనకు రూ.60లక్షలు అప్పు ఉన్నారని, వాటిని ఎలాగైనా వసూలు చేయాలని ఎస్సై వద్ద మరో ఒప్పందం కుదిరింది. కొలుకులకు తనకు నమ్మినబంటైన కానిస్టేబుల్‌ను పంపించి అతనిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. తనకున్న విద్య యథావిధిగా అమలు చేస్తూ ఇతనిని కూడా చావు వరకు తీసుకెళ్లి.. అప్పు ఇస్తావా, కాగితాలు రాస్తావా అని బెదిరించాడు. మూడు ప్రామిసరీ నోట్లు వేర్వేరు తేదీలతో రూ.35 లక్షలకు రాయించి తెల్ల కాగితాలపై కూడా సంతకాలు తీసుకున్నారని బాధితుడు అప్పారావు ఈనెల 11న ఎస్పీని కలిసి వాపోయారు. దీనిపై విచారణ జరిపి నివేదిక పంపమని మార్కాపురం డీఎస్పీ నాగరాజును ఎస్పీ ఆదేశించారు. ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. గుంటూరు నుంచి కూడా ఒక వ్యాపారి వీళ్ల ఆగడాలు భరించలేక ఒక ఎమ్మెల్యే ద్వారా నేరుగా డీఎస్పీని కలిసి వివరించేందుకు వెళ్తున్నానని చెప్తున్నారు.

● బయట వారికి ఒక న్యాయం.. అతనికి మరో న్యాయం

తనకు రావాల్సిన బాకీలు వసూలుకు ఖాకీలను వాడుకునే 'వ్యాపారి' తాను ఇవ్వాల్సిన వారు అడిగితే మాత్రం ఎదురుదాడికి దిగుతున్నారు. ఆయనకు కూడా ఈ ఎస్ఐనే అండగా నిలుస్తున్నారు. ఆస్తిలో తమకు రావాల్సిన వాటా ఇవ్వమని అడిగేందుకు వచ్చిన వ్యాపారి రక్తసంబంధీకులను స్టేషన్‌కు పంపించి బెదిరించి పంపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. బజారులో తన సమస్యను అడుగుతుంటే అకస్మాత్తుగా పోలీసులు రావడమేంటి, తీసుకెళ్లడమేంటని బాధితులు లబోదిబోమంటున్నారు. వీధిలో అల్లరి జరుగుతుందని తెలిసి తాము వచ్చామని చెబుతూ పోలీసులు సమస్యను పక్కదారి పట్టించారు. ఈ విషయంపై కూడా బాధితులు ఈ-మెయిల్ ద్వారా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సామాన్యులు ఎవరైనా తమకు బాకీలు రావాలని స్టేషన్‌కు వెళితే సివిల్ విషయాల్లో జోక్యం చేసుకోమని చెప్పే పోలీసులు మరి సంపన్నుల పట్ల ఇంతటి శ్రద్ధ పెట్టి సామాన్యులను ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిందితుడిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు

పాత కక్షల నేపథ్యంలో ఘటన



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ, ఎస్సైలు

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో విచారణకు హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న నిందితుడిపై దాడి చేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు ఆ కేసు వివరాలు వెల్లడించారు. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి 2018లో పాతకక్షల నేపథ్యంలో కిస్టిపాటి వెంగళరెడ్డి అతని కుమారుడు కొండారెడ్డిపై కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో కొండారెడ్డి చనిపోయాడు. దీంతో బాపిరెడ్డి కుటుంబ సభ్యులపై హత్య కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ నిమిత్తం ఈ నెల 11వ తేదీన బాపిరెడ్డి మార్కాపురం ఆరో అదనపు జిల్లా కోర్టుకు హాజరయ్యాడు. అనంతరం గ్రామంలో కక్షల నేపథ్యంలో ప్రస్తుతం నివాసముంటున్న కడప జిల్లా బి.మఠం మండలం జౌకుపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ మైదుకూరు వెళ్లే బస్సు ఎక్కాడు. హత్య కేసులో సాక్షులను ఇప్పటికే బెదిరించి ఎవరూ ముందుకు రాకుండా చేశాడని బాపిరెడ్డిపై వెంగళరెడ్డి కక్ష పెంచుకున్నాడు. శిక్ష పడినా, పడకపోయినా ఎలాగైనా మట్టుబెట్టాలని యోచించాడు. కేసు వాయిదాకు వెళ్లి తిరుగు ప్రయాణమైన బాపిరెడ్డిని అనుసరించి ముఖానికి గుడ్డకట్టుకుని బస్సులోకి ఎక్కిన వెంగళరెడ్డి.. పొట్లంలోని కారాన్ని బాపిరెడ్డి కళ్లలో చల్లాడు. తర్వాత కత్తితో పొడవబోగా బాపిరెడ్డి తప్పించుకున్నాడు. కొంతదూరం వెంబడించిన వెంగళరెడ్డి బస్టాండ్ సమీపంలో కత్తిని పారవేసి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు వెంగళరెడ్డి కోసం గాలింపు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 12న కార్ స్టాండ్ సమీపంలో వెంగళరెడ్డి ఉన్నట్లు సమాచారం రావడంతో సీఐ సుబ్బారావు సూచనల మేరకు ఎస్సై సైదుబాబు సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. దాడి కేసులో వెంగళరెడ్డిని బుధవారం కోర్టులో హాజరుపర్చడంతో న్యాయాధికారి రిమాండ్ విధించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, అంకమ్మరావులు పాల్గొన్నారు.

జార్జి కాలేజీకి యూజీసీ 12బీ గుర్తింపు

అవీఇవీ



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జార్జి ఇంజనీరింగ్ కాలేజీకి యూజీసీ(యూనియన్ గ్రాంట్స్ కమిషన్) 12బీ గుర్తింపును జారీ చేసిందని కాలేజీ సాంకేతిక సలహాదారు ఆదిమూలపు సురేష్ తెలిపారు. కాలేజీలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇలాంటి గుర్తింపు రెండు కాలేజీలకు మాత్రమే ఉందన్నారు. అందులో ఒకటి జార్జి కాలేజీ కావడం సంతోషదాయకమని చెప్పారు. దీని వల్ల కాలేజీలో విద్యార్థులు పరిశోధనలు, ఆవిష్కరణలకు యూజీసీ నిధులు మంజూరవుతాయన్నారు. సంవత్సర కాలంలోనే తమ కళాశాలకు నాక్, అటానమస్‌తోపాటు యూజీసీ 12బీ గుర్తింపు రావడం కష్టానికి నిదర్శమని పేర్కొన్నారు. త్వరలో డీమ్డ్ యూనివర్సిటీగా కాలేజీకి గుర్తింపు రానుందని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, హెచ్‌వోడీలు మస్తానయ్య, ఎస్‌డీ ఖాశిం, కె.డానియేల్ పాల్గొన్నారు.

మార్గం సుగమం

(5వపేజీ తరువాయి)

సదరు ఉపసంఘం తక్షణం ఈ అంశంపై దృష్టి సారించి నెల రోజుల్లో ప్రతిపాదనలు కేబినెట్ ముందు ఉంచాలని సీ ఎం చంద్రబాబు ఆదేశించారు. తదనుగుణంగా బుధవారం అమరావతిలోని సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ సమావేశమై చర్చించారు.

నేటి నుంచి వినతుల స్వీకరణ

ప్రత్యక్షంగా ప్రజలను కలిసి జిల్లాలు, డివిజన్లు, మండలాలు, రెవెన్యూ గ్రామాల స్థాయి వరకు మార్పులు, చేర్పులపై వినతులు స్వీకరించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆమేరకు ఉపసంఘ సభ్యులు ఈనెల 29,30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్లకు కూడా ఆయా వర్గాల ప్రజలు ఈ అంశాలపై తమ వినతులు, ప్రతిపాదనలను లిఖితపూర్వకంగా గురువారం నుంచి వచ్చేనెల 2వతేదీలోపు సమర్పించే అవకాశాన్ని కల్పించారు. వాటిన్నింటినీ పరిశీలించి సెప్టెంబరు 15న సీఎంకు ఉపసంఘం తరఫున ప్రతిపాదనలు అందజేయనున్నారు.

మార్కాపురం జిల్లా ఆవశ్యకతను వివరించిన మంత్రి స్వామి

జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి బుధవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అయ్యారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వారికి వివరించారు. పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు సంబంధించి గతంలో పార్టీ, ప్రభుత్వ పరంగా ఇచ్చిన హామీలను వారికి గుర్తు చేశారు. మరోవైపు డాక్టర్ స్వామి తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం రామనాథపురం (ఎన్‌వివికండ్రిక) గ్రామంలోని ఒక వీధి నెల్లూరు జిల్లా పలుకూరు పంచాయతీలో ఉందని చెప్పారు. దానిని పూర్తిగా నందనవనం పంచాయతీలో కలపాలని కోరారు. మండల కేంద్రమైన జరుగుమల్లికి సుదూరంగా ఉన్న ఎండ్లూరపాడు గ్రామాన్ని పొన్నలూరు మండలంలో కలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ చర్యలు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు అనుకూలంగా ఉండటంతో అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాది డిసెంబరు ఆఖరులోపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పొగాకు రైతుకు గడ్డుకాలం

నోబిడ్‌లతో బేళ్లను వెనక్కి పంపుతున్న బయ్యర్లు

అమ్మకాలు లేక లబోదిబోమంటున్న రైతులు



వేలానికి తెచ్చిన పొగాకు చెక్కులు

పొదిలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు ఈ ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధరలు చూస్తే పొగాకు రైతులకు గడ్డుకాలం నడుస్తున్నట్లుగా ఉంది. పెట్టుబడులతోపాటు కూలి అధకంగా పెరగడం.. ధరలు మందగించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వేలం ప్రారంభమై సుమారు ఆరునెలలు గడుస్తున్నా 8.38 మిలియన్‌లు మాత్రమే కొనుగోలు చేశారు. వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లలో ఎక్కువ శాతం నోబిడ్ అవుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాల కారణంగా మేలిమ రకం పొగాకు తక్కువగా వచ్చింది. ముందు అమ్మకాలు జరిగినా తర్వాత తిరస్కరణకు గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిలో పోటీపడి కొనుగోలు చేసిన బయ్యర్లు ఈ ఏడాది ఎందుకు కొనడం లేదో అర్థంకావడం లేదని అంటున్నారు. ప్రస్తుతం పొగాకు ధర సరాసరి రూ.233 నడుస్తోందని అధికారులు చెప్తున్నారు. పొదిలి వేలం కేంద్రంలో ఈఏడాది 11.11 మిలియన్‌ల పొగాకు కొనుగోలుకు అనుమతి ఉంది. ప్రస్తుతానికి 8.38 మిలియన్‌ల పొగాకు అమ్మకాలు జరిగాయి. అధికారికంగా మరో 2.7 మిలియన్‌లు కొనాల్సి ఉంది. 18 మిలియన్‌ల పొగాకు ఉత్పత్తి అయినట్లు అధికారులు అంచనా వేశారు. ఈవిధంగా పండిన పంట మొత్తం అమ్మకాలు పూర్తి కావాలంటే మరో రెండు నెలలకాలం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. పొగాకును కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- **పొదిలి వేలం కేంద్రం పరిధిలో 13 మండలాల్లో 2,700 బ్యారన్‌లు.. 4,500 మంది రైతులు ఉన్నారు.**
- **అయిపోయిన పంట కాలానికి అనుమతి 8,600 హెక్టార్లు**
- **సాగైన పంట 11వేల 31 హెక్టార్లు**

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

గిరిరాజ్ కుమార్, వేలం నిర్వహణాధికారి

రాబోవు సీజన్‌లో పొగాకుకు ప్రత్యామ్నాయం పంటలను సాగు చేసుకోవాలి. రాబోవు పంటకాలానికి బ్యారన్‌కు 36 క్వింటాళ్లు మత్రమే అనుమతి ఉంది. దానికి మించి సాగు చేసి రైతులు నష్టపోవద్దు. తక్కువ మొత్తంలో నాణ్యమైన పొగాకు పండించాలి. సెప్టెంబరు, అక్టోబర్‌లో నాట్లు వేసుకొని పొటాస్, పచ్చిరొట్టె ఎరువులు వాడితే నాణ్యమైన పొగాకు, అధిక దిగుబడి వస్తుంది.

రైతుల సంక్షేమం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం

అన్నదాత సుఖీభవ అమలుతో ఆనందడోలికల్లో రైతులు

పల్లామల్లిలో శత ట్రాక్టర్లతో అభినందన ర్యాలీ

ఎద్దులబండిపై వచ్చిన విజయ్‌కుమార్‌కు నీరాజనం



ఎడ్లబండిపై బీఎన్, ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న రైతులు

చీమకుర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చెప్పారు. సూపర్‌సిక్స్ హామీలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత రూ.7 వేలు నిధులు జమ చేసిన సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో రైతు సంబర సభను బుధవారం సాయంత్రం పల్లామల్లిలో అట్టహాసంగా నిర్వహించారు. దాదాపు వంద ట్రాక్టర్లతో రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన రైతులతో కలిసి ఎద్దుల బండిపై సవారీ చేసిన ఎమ్మెల్యేకు అడుగడుగునా జననీరాజనం లభించింది. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన సభలో విజయ్‌కుమార్ ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం గత ఏడాదికాలంలో ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను వివరించారు. దాదాపు రూ.300కోట్లతో బర్లీపొగాకు పండించిన రైతులను ఆదుకున్నారన్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గుండ్లకమ్మ జలాశయం గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడినట్లు చెప్పారు. అలాగే కారుమంచి మేజర్ కట్ట పునరుద్ధరణ, రామతీర్థం గేట్లకు మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని కష్టాలున్నా సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తుండడంతో ప్రజలు సంతోషకరంగా ఉన్నారన్నారు. ఈ నెల 15నుంచి మహిళలకు ఉచితబస్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, మండవ జయంత్‌బాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తెళ్ల మనోజ్‌కుమార్, మద్దినేని హరిబాబు, కూనంనేని లోకేష్, అన్నంనేని రాఘవయ్య, పారా చంద్రశేఖర్, కరిచేటి వెంకటేశ్వరరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, బొమ్మల అంకయ్య, మేడిబోయిన శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, ఇస్తర్ల ఏడుకొండలు, రాజశేఖరరెడ్డి, యానం వెంకటేశ్వర్లు, సరికొండ చిరంజీవిరాజు, పొందూరి హరిబాబు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాతిరేకం

(5వపేజీ తరువాయి)

బుధవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 28.60 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మద్దిపాడు మండలంలో 198.40 మి.మీ కురిసింది. నాగులుప్పలపాడు మండలంలో 130.40, కొత్తపట్నంలో 100.6, ఒంగోలు రూరల్ మండలంలో 62.20. అర్బన్‌లో 62.20, దర్శిలో 46.8, సంతనూతలపాడులో 41.4, కురిచేడులో 41.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మరికొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. నల్లమల అటవీ ప్రాంతంలోనూ విస్తారంగా వర్షం పడింది. దీంతో జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలలో నీటి ప్రవాహం పెరిగింది.

నిండుకుండలా గుండ్లకమ్మ

వర్షాలతోపాటు సాగర్ కాలువల నుంచి వస్తున్న నీటితో గుండ్లకమ్మ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఆ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 3.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3 టీఎంసీలకు చేరింది. దీంతో మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. జిల్లాలోని పలుప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగాయి. నాగులుప్పలపాడు మండలం కొత్తకోట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒంగోలు రూరల్ మండలంలోని ముదిగండి వాగు కూడా పొంగి ప్రవహిస్తుండటంతో ఆవైపు రాకపోకలు నిలిచిపోయాయి. దోర్నాల మండలంలోని దొంగల వాగు పొంగడంతో కర్నూలు-గుంటూరు రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది.

జనజీవనానికి ఆటంకం

తెరపిలేకుండా కురుస్తున్న వర్షం జనజీవనానికి ఆటంకంగా మారింది. వర్షం అధికంగా కురిసిన ఒంగోలు, దర్శి పట్టణాలు, మద్దిపాడు, కొత్తపట్నం ఇతర మండల కేంద్రాల్లోని శివారు కాలనీల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రస్తుత వర్షాలు మరో మూడు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ అన్సారియా బుధవారం మండల స్థాయిలోని తహసీల్దార్లు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లో 1077నంబర్‌తో కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు. ఆలస్యంగానైనా మంచి వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురించాయి. ప్రస్తుతం దర్శి ప్రాంతంలో వరి నాట్లు వేస్తుండగా.. పశ్చిమప్రాంతంలో పత్తి, మిర్చి ఇతర పైర్లు వేసి ఉన్నాయి. వాటికి ఈ వర్షాలు మేలు చేయనున్నాయి. ప్రస్తుత వర్షం కంది, మిర్చి, మినుము, వరి, మొక్కజొన్న, అలసంద ఇతరత్రా పంటలు విస్తారంగా సాగు చేసేందుకు ఉపకరిస్తుందని రైతులు చెప్తున్నారు.

వర్షాలకు కూలిన మట్టి మిద్దె

రాచర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల బీసీ కాలనీలో వేల్పుల పెద్ద రాజయ్యకు చెందిన మట్టిమిద్దె బుధవారం కూలింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వాన కురుస్తుండడంతో నాని మిద్దె కూలిపోయింది. ప్రస్తుతం ఆ మిద్దెలో మండ్ల చిన్న పుల్లయ్య అని వ్యక్తి అద్దెకు ఉంటున్నారు. ఎలాంటి ప్రమాదం జరగలేదు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



కూలిన శ్లాబు

బార్లకూ లాటరీ!

(5వపేజీ తరువాయి)

తగ్గకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. దరఖాస్తు ఫీజు రూ.5లక్షలుగా నిర్ణయించినట్లు సమాచారం.

లైసెన్స్ ఫీజు ఇలా..

జనాభా ప్రాతిపదిక బార్ల లైసెన్స్ ఫీజును వసూలు చేయనున్నారు. 50 వేలలోపు ప్రజలు ఉన్న ప్రాంతాల్లో రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షలు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 5లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లోరూ.75 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. ఆ ప్రకారం ఒంగోలులో ఉన్న 15, మార్కాపురంలో ఉన్న 5 బార్లు రూ.55 లక్షల స్లాబ్ కిందకు వస్తాయి. మిగిలిన చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరులో ఉన్న బార్లు రూ.35 లక్షల స్లాబు పరిధిలో ఉంటాయి. వీటిలో గీత కార్మికులకు కేటాయించిన మూడు బార్లకు లైసెన్స్ ఫీజు కూడా తగ్గే అవకాశం ఉంది.

బార్లపై పర్మిట్ రూంల ఎఫెక్ట్

రోడ్లపై తాగుడును నిరోధించేందుకు మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలకు లైసెన్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నవంబర్ నుంచి మద్యం షాపులు మినీబార్లుగా మారనున్నాయి. అదేక్రమంలో వైన్‌షాపుల కంటే బార్లకు సరఫరా చేసే మద్యం ధర అధికంగా ఉంటుంది. దీన్ని బార్ల నిర్వాహకులు ఎమ్మార్పీతో సంబంధం లేకుండా విక్రయించుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఆసరా చేసుకొని ఇప్పటి వరకూ ఇష్టానుసారం మద్యం అమ్మకాలు చేశారు. రానున్న రోజుల్లో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలు ఏర్పాటు చేస్తున్నందున ఆ ప్రభావం బార్లపై పడనుంది. దీంతో బార్ల నిర్వాహకులు మల్లాగుల్లాలు పడుతున్నారు.

ఎక్సైజ్ శాఖకు ఆదాయం

జిల్లాలో 25 బార్లు ఉన్నాయి. ఒక్కోదానికి కనీసం 4 దరఖాస్తుల చొప్పున మొత్తం బార్లకు 100 వస్తే దరఖాస్తు ఫీజు ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.5కోట్ల మేర ఆదాయం సమకూరుతుంది. లైసెన్స్ ఫీజు ద్వారా ఏడాదికి రూ.110కోట్లకుపైగా ఆదాయం రానుంది. ఇక మద్యం విక్రయాల ద్వారా వచ్చేది అదనంగా ఉంటుంది.

ఆధునికీకరణకు ఆటంకం

నత్తనడకన సాగర్ కాలువల అభివృద్ధి పనులు

చీమకుర్తి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో రూ.5కోట్లు మంజూరు

పలు మేజర్లలో ప్రారంభం కాని పనులు.. ఓబీసీపై ఆక్రమణలతో ముందుకుసాగని వైనం

చేష్టలుడిగి చూస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

చేతిచమురు వదిలించుకుంటున్నామంటున్న నీటిసంఘాల బాధ్యులు



జగన్ జమానాలో సాగర్ కాలువల్లో చిల్లకంప కూడా చెలగలేదు. కంతలకు తట్టమట్టి కూడా పోయలేదు. కాలువలు పగుళ్లిచ్చినా, నీరు లీకయినా మరమ్మతులకు రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదు. దీంతో ఏటేటా కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. సాగర్ కాలువలకు నీరు విడుదల చేసినా.. దిగువ ఆయకట్టు సరే ఎగువ ఆయకట్టుకు కూడా అందని దుస్థితి. దీంతో పంటల సాగు అరకొరగా మారింది. ఈనేపథ్యంలో సీఎం చంద్రబాబు కాలువల బాగుపై దృష్టి సారించారు. అయితే క్షేత్ర స్థాయిలో నెలకొన్న నిర్లక్ష్యం పనులకు ఆటంకంగా మారింది.

చీమకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాగర్ కాలువల ఆధునికీకరణకు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నడుంబిగించింది. చీమకుర్తి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో ఉన్న పలు మేజర్లు, మైనర్ కాలువల అభివృద్ధిపై దృష్టిసారించింది. కాలువల్లో పూడికలు, ఏపుగా పెరిగిన చిల్ల చెట్లు, ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని దయనీయస్థితిలో ఉన్న కట్టల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. మొత్తం 87 రకాల పనుల నిర్వహణకు రూ.5.12కోట్లు నిధులు మంజూరయ్యాయి. తదుపరి టెక్నికల్, పరిపాలన అనుమతుల్లో నెలకొన్న జాప్యం, నీటి సంఘాల అధ్యక్షుల మధ్య పనుల పంపకం తదితర విషయాల్లో నెలకొన్న సందిగ్ధతతో విలువైన సమయం వృథా అయింది. ఈలోపు ముందస్తు వర్షాలతో సాగర్, శ్రీశైలం జలాశయాలు నిండటం, అనుకున్న సమయం కన్నా ముందుగానే జలాశయాల నుంచి నీరు విడుదలయ్యాయి. తీరా పుణ్యకాలం ముంచుకొచ్చిన తర్వాత తీరిగ్గా పనులు ప్రారంభించిన నీటిసంఘాల అధ్యక్షులకు ఫీల్డ్ లెవెల్లో ఎదురవుతున్న ఆటంకాలతో చుక్కలు కనిపిస్తున్నాయి. ఇంకా కొన్ని మేజర్లలో ఇంకా పనులు ప్రారంభంకాకపోవటం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది.

ఓబీసీపై ఆక్రమణల పర్వం

రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలు వరకు తాగు, సాగునీరు అందించే కీలకమైన ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై ఆక్రమణలు చోటుచేసుకోవటం పనుల నిర్వహణకు ప్రధాన ఆటంకంగా మారింది. ఇదిలా ఉంటే కెనాల్ గట్టులపై భారీస్థాయిలో చిల్లచెట్లు పెరగడం ప్రధాన సమస్యగా మారింది. వీటి తొలగింపునకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏపాటికి సరిపోవని పనులు నిర్వహిస్తున్న నీటిసంఘాల బాధ్యులు వాపోతున్నారు. కెనాల్‌పై చోటుచేసుకున్న గ్రానైట్ వ్యర్థాల తొలగింపు పెద్ద సమస్యగా మారింది. కాలువ కట్టలపై యథేచ్ఛగా గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు వ్యర్థాల రాళ్లను డంప్ చేస్తున్నా కూతవేటు దూరంలో నీటిపారుదలశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. దీంతో కాలువ మరమ్మతులు నత్తనడకన నడుస్తున్నాయి.



కాలువ కట్టపై ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

ఒకవైపు పనులు.. మరోవైపు నీటి కోసం ఎదురుచూపులు

చీమకుర్తి డివిజన్ పరిధిలో పలు మేజర్ల కింద ఉన్న ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. తీరా పుణ్యకాలం ముగిసిన తర్వాత పనులు ప్రారంభించటంతో రామతీర్థం జలాశయం నిండుగా జలాలున్నా దిగువకు నీటిని విడుదల చేయటంలో అధికారులు మిన్నకుండిపోయారు. లేటుగా ప్రారంభించిన పనులు, పనుల నిర్వహణలో నెలకొంటున్న ఆటంకాలతో పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

రైతుల కోసం చేతిచమురు వదిలించుకుంటున్నాం

గోగినేని శ్రీనివాసరావు, నీటి సంఘ అధ్యక్షుడు, చీమకుర్తి



సాగర్ కాలువలను అభివృద్ధి చేసి రైతులకు సాగునీటి కష్టాలు తొలగించాలన్న ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఆర్థికంగా గిట్టుబాటు కాకపోయినా, కష్టనష్టాలు ఎదురైనా పనులు నిర్వహిస్తున్నాం. కాలువలపై నెలకొన్న ఆక్రమణలు, వృక్షాల స్థాయికి ఎదిగిన చిల్లచెట్ల తొలగింపులో జాప్యం చోటుచేసుకుంటుంది. ఏదేమైనా వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి నీరందిస్తాం. మాకు అధికారులు సహకరించాలి.

రాష్ట్ర 'ఉత్తమ' అవార్డులకు 14 దరఖాస్తులు

ఒంగోలు, విద్య, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలో 14 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 11 మంది అవార్డులు కోసం దరఖాస్తు చేయగా లీప్‌యాప్ ద్వారా ముగ్గురు టీచర్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల బరిలో నిలిచారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు ముగ్గురు, స్కూలు అసిస్టెంట్లు ఆరుగురు, ప్రధానోపాధ్యాయులు ఇద్దరు దరఖాస్తు చేశారు. లీప్ యాప్ ద్వారా ప్రతిభావంతులైన ముగ్గురు టీచర్లను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్ర స్థాయికి వీటిని ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్, డైట్ ప్రిన్సిపాల్, ఇద్దరు జిల్లా అధికారులతో కూడిన స్ర్కీనింగ్ కమిటీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు టీచర్లను ఎంపిక చేస్తోంది.

మిగిలిన నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు షెడ్యూల్ రూపొందించాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిగిలిపోయిన నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు షెడ్యూల్ రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో బుధవారం జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సమావేశానికి జేసీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 930 మెట్రిక్ టన్నుల పొగాకును జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి వెంటనే ఆమోదించాలని నిర్ణయించారు. జిల్లాలో పొగాకు కొనుగోలు అదనపు కేటాయింపు కావాలని ఉన్నతాధికారులను నివేదికను పంపించాలని జేసీ సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని రిజస్టర్ స్కాన్ సెంటర్లను విధిగా తనిఖీలు చేయాలని జిల్లా రెవెన్యూఅధికారి పి. చినఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో బుధవారం జరిగిన పీసీపీఎన్ డీటీ యాక్ట్ జిల్లా స్థాయి అథారిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఎంహెచ్‌వో టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ యాక్టును పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. యాక్టు నోడల్ అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అమలు జరుగుతున్న చట్టం వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, ఎన్‌జీవో సంస్థ ప్రతినిధి డాక్టర్ లక్ష్మి, డాక్టర్ నబీవల్లి, జిల్లామాస్‌మీడియా అధికారి డి. శ్రీనివాసులు, జిల్లా ఉప మాస్‌మీడియా అధికారి సరోజిని పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలకు రక్షణ కల్పించాలి



ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యజమానులు

ఒంగోలు విద్య, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థలకు రక్షణ కల్పించాలని ఏపీ ప్రైవేటు స్కూలు అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం రాష్ట్ర కో ఆర్డినేటర్ పి. ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో పాఠశాలల యాజమాన్యాలు జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పాఠశాల ఆవరణలోకి ఎస్ఎంసీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు మినహా ఇతరులు ఎవ్వరు పాఠశాలల్లోకి రాకూడదని ఇటీవల పాఠశాల విద్యాకమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి ఉత్తర్వుల తీవ్రత తెలియజేస్తామన్నారు. విద్యార్థులు సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా యాజమాన్యాలు చూడాలని చెప్పారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, కార్యదర్శి శివకోటిరెడ్డి, మాజీ అధ్యక్షుడు బొమ్మల శ్రీనివాసరావు, జాలిరెడ్డి, ఆత్మకూరి బ్రహ్మయ్య, ఒంగోలు అధ్యక్షురాలు ఈవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

చేపల వేట బంద్

అల్లకల్లోలంగా సముద్రం

పడవలను ఒడ్డుకు చేర్చుకున్న మత్స్యకారులు

ఒంగోలు నగరం, ఆగష్టు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తీరంలో చేపల వేటను మత్స్యకారులు నిలిపివేశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అలలు ఎగిసిపడుతుండటంతో వేట సాగడం లేదు. దీంతో మత్స్యకారులు రెండు రోజులుగా వేటను నిలిపివేశారు. మరో నాలుగైదు రోజుల పాటు వేట సాగే పరిస్థితి లేదని మత్స్యకారులు అంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో సముద్రం అలలు సాధారణం కంటే తీరానికి ముందుకు తోసుకువచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వేట చేయవద్దని హెచ్చరికలు చేసింది. దీంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. బుధవారం రాత్రి నుంచే తీర ప్రాంత గ్రామాల్లో గాలులతో కూడిన వర్షం పడుతోంది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి తీరంలోని అనేక ప్రాంతాల్లోకి నీరు చేరి మత్స్యకారులు రాకపోకలకు కూడా ఇబ్బందులు పడ్డారు. బుధవారం కూడా తీర ప్రాంతగ్రామాల్లో వాన కురుస్తూనే ఉంది. తీరప్రాంత గ్రామాల్లో చలిగాలుల తీవ్రత పెరిగింది. మరో మూడు రోజులు భారీ వర్షాలంటూ వాతావరణ శాఖ చెప్పటంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు.

20 లక్షల టర్నోవర్ దాటితే జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి

కలెక్టర్ తమీమ్‌అన్సారియా



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రూ.40 లక్షల టర్నోవర్(వస్తువుల విషయంలో), రూ.20 లక్షల టర్నోవర్(సేవల విషయంలో) దాటిన వ్యాపారసంస్థలను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కమర్షియల్ ట్యాక్స్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పన్ను పరిధిని విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు పన్ను బకాయిదారుల ఆస్తుల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ శాఖకు అందించాలన్నారు. పన్ను ఎగవేతదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. రూ 2.50 లక్షల విలువను మించిన సరఫరా ఒప్పందాలపై టీడీఎస్ మినహాయించి జీఎస్‌టీ ఆర్-7 ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. పన్నులు లేకుండా సరుకులు రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రానైట్, ఇతర సరుకుల అక్రమరవాణాను అరికట్టేందుకు ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రూ.10 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలు, డాక్టర్లు, ఆర్కిటెక్టులు వంటి ప్రొఫెషనల్స్ ట్యాక్స్ చెల్లించాలని చెప్పారు. నెలకు రూ.15వేలు కంటే ఎక్కువ జీతం పొందుతున్న ఉద్యోగులు కూడా ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్టేట్ ట్యాక్ జాయింట్ కమిషనర్ వై. కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం. సత్యప్రకాష్, ఒంగోలు-1, -2 సర్కిళ్ల అసిస్టెంట్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు రాజశేఖర్, డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, సుశీల, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, పద్మశ్రీ, శ్రీనివాసులు ఉన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం

తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్

ఒంగోలు కలెక్టరేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి తహసీల్దార్లతో బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలు, కూలిపోయే అవకాశం ఉన్న పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చిన్నారులు, మహిళలు, గర్భిణులు, వృద్ధులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్థానికంగా ఉన్న కాలువలు, వాగులు, వంకలు, ఇతర నీటి వనరులు ఉధృతంగా ప్రవహిస్తున్న చోట అటు వైపు వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయా ప్రాంతాల్లో ఉంచాలన్నారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైనా, సహాయం అవసరమైనా ప్రజలు వెంటనే జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చేందుకు కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 16నుంచి 24వ తేదీ వరకు 24గంటలు పనిచేసేలా కంట్రోలు రూంను ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య, పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఈ కంట్రోలు రూములో షిఫ్టులవారీగా పనిచేసేలా విధులను కేటాయించామని చెప్పారు. అదే విధంగా మండల, డివిజన్ స్థాయిలో కూడా కంట్రోలు రూములు ఏర్పాటు చేయలని కలెక్టర్ ఆదేశించారు.

క్విట్ కార్పొరేషన్-క్విట్ అగ్రికల్చర్ ర్యాలీ అడ్డగింత

ముందస్తు అనుమతి లేకపోవడంపై పోలీసుల ఆగ్రహం

అక్కడే నిరసన తెలిపిన రైతు సంఘాల నాయకులు



ర్యాలీ చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆందోళనలను అణిచివేయాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పలువురు నేతలు హెచ్చరించారు. ఒంగోలులో శాంతియుతంగా రైతుల సమస్యలపై చేపట్టిన ర్యాలీని బుధవారం పోలీసులు అడ్డుకోవడాన్ని వారు ఖండించారు. సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ ఐక్యవేదికల ఆధ్వర్యంలో చేపట్టిన క్విట్ కార్పొరేషన్-క్విట్ అగ్రికల్చర్ ర్యాలీకి ముందుస్తు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆయా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి వివిధ రైతు సంఘాలు, కిసాన్ కాంగ్రెస్, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు బుధవారం ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, జెండాలతో మినీస్టేడియం వద్దకు చేరుకున్నారు. ర్యాలీ ప్రారంభమయ్యే సమయంలో సీఐలు వై.నాగరాజు, వెంకటకృష్ణ, ఎం. శ్రీనివాసులు తమ సిబ్బందితో మినీస్టేడియం వద్దకు చేరుకున్నారు. పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్నందున, ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. సమయభావం వల్ల అనుమతి పొందలేకపోయామని, రైతుసమస్యలపై శాంతియుతంగా ర్యాలీ చేపడతామని నేతలు చెప్పారు. ముందస్తు అనుమతి కావాల్సిందేనని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసులు ర్యాలీకి అనుమతించకపోవడంతో అక్కడే ధర్నా నిర్వహించారు. చుండూరిరంగారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ 2018లో ఇచ్చిన హామీల అమలుకు చేపట్టిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. బీజేపీ తన ఆశ్రిత వ్యాపార వర్గాలకు కోట్లాదిరూపాయాల సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, వివిధ రైతు సంఘాల నాయకులు హనుమరెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కొండ్రగుంట సుబ్బారావు, జే జయంతిబాబు, సుబ్బారెడ్డి, ఇరిగినేని వెంకటనరసయ్య, బి.సుబ్బారావు అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, కే సుబ్బారావు, రమేష్, వీరాస్వామి పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్



విస్కోమీటర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు రోడ్డులోని జార్జి ఫార్మసీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ తెలిపారు. కాలేజీలో విస్కోసిటీ అండ్ రియాలజీ అనే అంశాలపై వర్క్‌షాప్ జరిగిందన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, పీహెచ్‌డీ విద్యార్థులు సిద్ధాంతపరమైన అంశాలు, మధ్యాహ్నం ప్రాక్టికల్ శిక్షణ సెషన్‌ల ద్వారా బ్రూక్‌ఫీల్డ్ విస్కోమీటర్ పరికరంపై నైపుణ్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కోకన్వీనర్లు ఎస్‌డీ ముజీబ్ రెహమాన్, బి.శ్రీనిధి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జువ్విగుంట కృష్ణబలిజ కాలనీలో సమస్యల తిష్ఠ

సైడు కాలువలు లేక ఎక్కడికక్కడ మురుగు నిల్వ

దుర్గంధం, దోమల దాడి ఉధృతం

ప్రమాదం అంచున విద్యుత్ స్తంభాలు

ఆందోళనలో ప్రజలు

మర్రిపూడి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జువ్విగుంట కృష్ణబలిజ కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. సైడు కాలువలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు విద్యుత్ స్తంభాలు కూడా శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. జువ్విగుంటలోని కృష్ణబలిజ కాలనీ టీడీపీకి అడ్డా. ఈ కారణంతోనే గత వైసీపీ పాలనలో కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించ లేదు. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీలోని అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చారు. ఆసమయంలో సైడు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నివాస గృహాల నుంచి వచ్చే మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి ధాటికి రాత్రివేళ కంటిమీద కునుకు ఉండటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. జువ్విగుంట-తంగెళ్ల రహదారి పక్కన ప్రధాన సైడు కాలువ ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న వాగులోకి మురుగు నీటిని పంపాలని స్థానికులు ఏళ్లుగా కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. మరోవైపు శిథిలమైన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కలిశెట్టి గోవిందమ్మ ఇంటి సమీపంలో విద్యుత్ వైర్లు గృహాల పైకప్పుల మీదుగా వెళ్తుండటంతో ఇనుప యాంగ్లర్లతో ఎత్తు పెంచారు. గాలులకు అవి ఒరిగిపోతున్నాయి. పసుపులేటి విజయ ఇంటిసమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ లేకపోవడంతో ఒకవైపునకు ఒరిగిపోయింది. ఏ సమయంలోనైనా కూలే ప్రమాదం ఉంది. పసుపులేటి వెంకటేశ్వర్లు ఇంటి సమీపంలో ఒరిగిన స్తంభం పడిపోకుండా తాళ్లతో కట్టారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


విరిగిన విద్యుత్ స్తంభాన్ని తాడుతో కట్టేసిన స్థానికులు

ఎమ్మెల్యే దామచర్లను కలిసిన ఒడా చైర్మన్


రియాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, రవిశంకర్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు చైర్మన్ పదవి రావడం కోసం చేసిన కృషికి దామచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే దామచర్ల ఈ సందర్భంగా రియాజ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత కంది రవిశంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతిగృహంలో విచారణ


డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు


చీమకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం డిప్యూటీ కలెక్టర్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి పార్థసారథి విచారణ జరిపారు. ఇటీవల హాస్టల్‌లో బాలిక జుట్టు కత్తిరించిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాటసమితి అధ్యక్షుడు సుజన్‌మాదిగ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు విచారణాధికారిని కలిసిన సంఘటనా బాధ్యులు, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. తన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చప్పిడి వెంగళరావు, జె.ఆంజనేయులు, పేరం శ్రీనివాసరావు, చింతలపాలెం యలమందబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఎన్నిక


నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అందరూ సమష్టిగా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత ఆర్థికరంగంలో ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ పాత్ర ప్రాముఖ్యమైనదని చెప్పారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా దివి రోశయ్య, కార్యదర్శిగా సీహెచ్‌ఎబీఎస్.నారాయణ, కోశాధికారిగా కేవీ.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా భార్గవప్రతాప్, వీఎస్.రాఘవేంద్రకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.మణికంఠ, సభ్యులుగా ఎ.రమేష్‌రెడ్డి, ఆర్.తేజసూర్యకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీని ఎమ్మెల్యే దామచర్ల అభినందించారు. కార్యక్రమంలో ట్యాక్స్ విభాగం జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్, డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


పీడీ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు నగరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గుర్రంకొండ వెలుగు ఏపీఎం బి.రజనీకుమారిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఒంగోలులో డీఆర్‌డీఏ పీడీ నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా సెర్ప్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు పీడీని కలిసి మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న ఏపీఎం రజనీకుమారిపై దాడి చేసి అసభ్య పదజాలంతో తిడుతూ వికృతి చేష్టలతో చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. దాడి చేయటమే కాకుండా హత్యాయత్నానికి పాల్పడ్డవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదరికి నిర్మూలన కోసం పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ బి.నరేంద్రకుమార్, కన్వీనర్ రామకృష్ణ, కోకన్వీనర్ ఎజ్రా, కోశాధికారి కోటేశ్వరరావు, డీపీఎం కృపారావు, కృష్ణకుమారి, ఏపీఎం బెజ్జం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మకాలనీ 2, 4వ లైన్‌లోని గుంతల్లో నిలిచిన వర్షపునీరు


కేశవరాజుకుంటలోని చిన్నమల్లేశ్వరకాలనీ జలమయం

చినుకుపడితే చిత్తడే..!

- భారీ వర్షానికి తడిసి ముద్దయిన నగరం
- పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తం

ఒంగోలులో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. దాంతోపాటు పలు కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలకు పాట్లు తప్పలేదు. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారాయి. నగరంలోని ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు లోతట్టు ప్రాంతాల్లో చెరువులను తలపించాయి. రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షంతో పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొప్పోలురోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీ స్టేడియంలో భారీగా వర్షపునీరు చేరింది. అలాగే శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్‌కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్ థెరిస్సాకాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలురోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, రైల్వేస్టేషన్‌రోడ్, పలు ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)


ఇందిరమ్మకాలనీ 5వ లైన్‌లో..


కొప్పోలు రోడ్డులో..

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు


హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక లాయర్‌పేటలోని టంగుటూరి ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలను అర్పించి మనకు స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, అటువంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, డాక్టర్ కొమ్మి నర్సింగరావు, మాకినేని అమరసింహం, తిరంగా యాత్ర ఇన్‌చార్జి దామెదర్, బొద్దులూరి ఆంజనేయులు, పి.లక్ష్మణ్, రమాదేవి, దండు శ్రీనివాసులు, రావులపల్లి నాగేంద్రయాదవ్, పి.తిరుమల, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వరయ్య, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20 నుంచి 25వతేదీ వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ సీపీఐ వంద వసంతాలను పురస్కరించుకొని ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారన్నారు. అలాగే ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు ఒంగోలు కళా ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా కళాకారులు పాల్గొంటారన్నారు. 23న భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటనలు కేవలం మీడియాకే పరిమితం అవుతున్నాయని ఆరోపించారు. ఒంగోలు డెయిరీ పాలకుల నిర్లక్ష్యం, అవినీతి వల్లే మూతపడిందన్నారు. ఆయా అంశాలపై రాష్ట్రమహాసభల్లో చర్చించి పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, నాయకులు ఆర్.వెంకట్రావు, శ్రీరామ్ శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, యుగంధర్, రాజేంద్ర, వలరాజు, నాగభూషణం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించాలి


సమస్యలపై చర్చిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని రోడ్లు, భవనాలశాఖ కార్యాలయంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి పాండురంగారెడ్డి, టౌన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, మహిళా విభాగం అధ్యక్షురాలు రజితమానస, ఉద్యోగులు ఏసురత్నం, చిరంజీవి, బాషా, శ్రీనివాసరావు, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


ముదిగొండి చప్టాపై వరద ఉధృతి

- స్తంభించిన రాకపోకలు


చప్టాపై నుంచి పారుతున్న వర్షపునీరు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలోని కరవది -కొప్పోలు రోడ్డులోని ముదిగొండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గత రెండు రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వరద ఎక్కువగా రావడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి.

పొంగిన వాగులు..నిలిచిన రాకపోకలు


కొత్తకోట వాగులో ప్రవహిస్తున్న వరద

నాగులుప్పలపాడు: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి మండల పరిధిలోని వాగులు పొంగి ప్రవహించాయి. పొలాలు వర్షపు నీటికి చెరువులా మారాయి. కొత్తకోట, హనుమాపురం వాగులకు వర్షపు నీరు చేరి నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రహదారిలో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రెండు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా వాగుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. చేకూరపాడు వద్ద వ్యవసాయ పొలాల్లోకి వర్షపు నీరు చేరి చెరువులను తలపించాయి.

అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలి : జేసీ

ఒంగోలు(రూరల్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలో గల అనధికార లేవుట్‌లను ఎల్ఆర్ఎస్ పద్ధతిలో క్రమబద్ధీకరించుకోవాలని జేసీ గోపాలకృష్ణ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్‌లు క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఒడా ప్లానింగ్ అధికారి బాబురావు, జేపీవోలు తదితరలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- జీజీహెచ్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆందోళన

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సమీపంలోని ఓ వెంచర్‌లో మృతి చెందిన రావినూతల సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సురేష్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులు ఒంగోలులోని జీజీహెచ్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మృతుడి భార్య ధనలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ తన భర్త మరణంపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. వెంచర్‌లో విద్యుత్ స్తంభాలు వేస్తున్న సురేష్‌ను చంపేసి ప్రమాదంగా చిత్రీకరించారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం వేరే జిల్లా నుంచి ఇక్కడకు వస్తే ప్రాణాలు తీశారని, జరిగిన ఘటనపై సంస్థ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తుంటే కనీసం సమాధానం కూడా చెప్పడం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ మాట్లాడుతూ దళిత యువకుడు సురేష్ కుటుంబానికి పోలీసులు న్యాయం చేయాలని, బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు, కొండపాగ క్రాంతి, పొన్నూరు రామారావు, మృతుడు సోదరుడు సురేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు ఆదేశించారు. ఒంగోలు మండలం కరవదిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. సర్వే అనంతరం స్థలాల యజమానులకు ఆస్తిహక్కు పత్రాలు ఇస్తామని చెప్పారు. గ్రామకంఠంలో నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ఆస్తి హక్కులు ఉండవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(రూరల్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలలో జిల్లా వాలీబాల్ అండర్-15 ఎస్‌జీఎఫ్‌కు బుధవారం క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుమార 100మందిపైగా క్రీడాకారులు తరలివచ్చారు. ఇందులో బాలికలను ఆరుగురిని, బాలురను ఆరుగురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.వెంకటరారవు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హజీరాబేగమ్, జిల్లా వాలీబాల్ అసోషియోషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ధనుంజయ్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18న విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలకు హాజరవుతారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బ్రహ్మంచౌదరికి కమ్మ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్మ కార్పొరేషన్ ద్వారా పేద కమ్మవారి సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. టీడీపీ గెలుపు కోసం పోరాడిన నిజమైన కార్యకర్త బ్రహ్మంచౌదరికి చైర్మన్ పదవి రావడం హర్షణీయం అన్నారు. సంఘ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ కార్పొరేషన్ విధులు, నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు, పావులూరి బాపయ్యచౌదరి, నాగబోయిన భాస్కర్‌రావు, బి.వెంకట్, ఎం.చౌదరి, జి.కిషోర్ పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో విద్యార్థి సంఘ ఎన్నికలు

ఒంగోలు విద్య, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మాంటిస్సోరి హైస్కూలులో బుధవారం విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను చిన్నప్పటి నుంచే అందించే లక్ష్యంగా ఈ ఎన్నికలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నూరుద్దీన్ తెలిపారు. 6నుంచి 10 తరగతులకు 1026 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును బ్యాలెట్ పద్ధతిలో వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శబరినాథ్, అకడమిక్ కో ఆర్డినేటర్ సులోచన, గ్లోరి, కొండయ్య, అపర్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఒంగోలు విద్య, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని బుధవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ భారతీదేవి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, వక్తృత్వ పోటీలు జరిగాయి.

జనసేన నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) చైర్మన్ పదవి రావడంతో ఆ పార్టీనాయకులు సంబరాలు నిర్వహించారు. బుధవారం ఒంగోలులోని చర్చిసెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న రియాజ్‌కు గుర్తింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, పిల్లి రాజేష్, బి.శ్రీదేవి, పల్లా ప్రమీల, గోవింద్, కోమలి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో తేలికపాటి వర్షం

కొండపి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొండపి ప్రాంతంలో తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు సన్నటి జల్లు పడుతూనే ఉంది. ఎర్రనేలల్లో కంది పంటను రైతులు ఎదబెడుతున్నారు. వర్షం, వాతావరణం కంది సాగుకు అనుకూలంగా ఉందని రైతులు తెలిపారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ


మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

కొత్తపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులను జమ చేసిందని ఏవో జి.కిషోర్‌బాబు అన్నారు. బుధవారం సంకువానిగుంట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో కిషోర్‌బాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నిధులు ఇంకా జమ కాని రైతులు తమ ఆధార్‌కార్డు వివరాలతో సరిచూసుకోవాలని కోరారు. అలాగే తాము సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి అజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఖాసిం, నీరజ, వెంకటరమణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవాలు

కొమరోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సిద్ధేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని సర్విరెడ్డిపల్లి - తాతారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో అంకాలమ్మ, పోలేరమ్మ, సీతలమ్మ, ఆంజనేయస్వామి వారి నూతన విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 16 నుంచి 18 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 16న గణపతి పూజ, రక్షాబంధన్, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, యంత్రాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలను వేదపండితులు గౌరుపెద్ది హరిహరకుమారశర్మతో నిర్వహిస్తారన్నారు. 17న విగ్రహాల గ్రామోత్సవం, చండీ, హోమాలు, రాత్రికి గుంటూరు వారిచే పాటకచేరీ, 18న విగ్రహా, యంత్ర, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలతోపాటు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అతిథి గృహానికి ఆలనాపాలనా కరువు



కంభం చెరువుకట్టపై నిరుపయోగంగా ఉన్న గెస్ట్‌హౌస్

- కంభం చెరువుకట్టపై నిరుయోపయోగంగా గెస్ట్‌హౌస్
- చోరీకి గురైన సామగ్రి

కంభం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ ఆలనాపాలనా లేకపోవడంతో దొంగలు గెస్ట్‌హౌస్‌లోని విలువైన తలుపులు, కిటికీలు, ఫర్నిచర్‌ను ఎత్తుకుపోయారు. దీంతో ఆ గెస్ట్‌హౌస్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం తాగుబోతులకు, పేకాట ఆడేవారికి నిలయంగా మారింది. 300 సంవత్సరాల కిందట బ్రిటీష్ కాలంలో అధికారులు విశ్రాంతి తీసుకునేందుకు విశాలమైన గెస్ట్‌హౌస్‌ను ఇక్కడ నిర్మించారు. ఆ తరువాత ఈ భవనం ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వచ్చింది. భవనానికి కాపలా లేకపోవడంతో 2 దశాబ్దాల కిందట టేకుతో నిర్మించిన తలుపులు, కిటీకీలు, ఫర్నిచర్ మొత్తం దొంగలు ఎత్తుకుని పోయారు. అప్పటి నుంచి పాడుపడింది. చెరువు కట్టకు వచ్చిన ప్రజలు స్నానం చేసి దుస్తులు మార్చుకునేందుకు ఈ గెస్ట్‌హౌస్ ఉపయోగపడేది. ప్రస్తుతం తలుపులు, కిటికీలు లేకపోవడంతో ఎవరూ వెళ్లలేకపోతున్నారు.

ఇరిగేషన్ అధికారులు దశాబ్దం కిందట గెస్ట్‌హౌస్ పునఃనిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయించి మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. అయితే విద్యుత్ సౌకర్యం లేకపోవడం, వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రివేళ దొంగలు సామగ్రిని దొంగిలించారు. దీంతో మళ్లీ గెస్ట్‌హౌస్ పాడుబడినదిగా మారింది. ప్రస్తుతం నీరు ఉన్నందున చెరువు అందాలను తిలకించేందుకు వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. తేరాతేజీ, వినాయక చవితి పండుగలకు చెరువు కట్టపైకి వేలాదిగా భక్తులు వస్తుంటారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఎక్కడా అవకాశం లేదు. ఇప్పటికైనా అధికారులు గెస్ట్‌హౌస్‌ను పునఃనిర్మించి వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



భూములను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ కళావతి

ఎన్నెస్పీ భూములపై విచారణ

త్రిపురాంతకం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలో అన్యాక్రాంతమైన ఎన్నెస్పీ భూములపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించడంతో బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతి ఆ భూములను పరిశీలించారు. కొంత భూమిలో వెంచర్లు వేసినట్లు, మరి కొంత సాగు భూములుగా మారినట్లు గుర్తించారు. తక్షణమే సర్వే జరిపి ఎన్నెస్పీ భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అన్యాక్రాంతమైన భూములకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు నివేదిక అందజేస్తామని ఎస్డీసీ కళావతి తెలిపారు. ఈ భూముల పరిశీలనలో జిల్లా సర్వేయర్ గౌస్‌భాషా, ఎన్నెస్పీ ఈఈ రామకృష్ణ, తహశిల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ సైదారావు ఉన్నారు.

సెరీకల్చర్ గెస్ట్ ఫ్యాకల్టీకి నైపుణ్య పరీక్ష

కంభం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ సెరీకల్చర్ కోర్సు బోధన నిమిత్తం 2025-26 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు కళాశాల ప్రాంగణంలో బోధన నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎస్‌సి సెరికల్చర్‌లో 50శాతం మార్కులు లేదా ఎంఎస్‌సీ అగ్రికల్చర్ (మెటమాలజీ) 50శాతం మార్కులు లేదా ఎంఎస్‌సీ బాటని లేదా జువాలజి అర్హతతో సెరి కల్చర్‌లో పిజి డిప్లమో లేదా బిఎస్‌సి అగ్రికల్చర్ చేసి ఉండాలి.

ఆ స్థలం ఆరేపల్లి చెన్నకేశవుల కుటుంబీకులదే

కంభం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కంభం పంచాయతీ పరిధి శీలం వీధిలో ఎస్‌పీజీపాలెంకు వెళ్లే రహదారి పక్కన ఖాళీ స్థలం ఆరేపల్లి చెన్నకేశవులు, కుమారులు ఆరేపల్లి మల్లికార్జునకు చెందినదేనని పలువురు ఎస్‌పీజీపాలెం వాసులు బుధవారం తహసీల్దార్ కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. శీలంవీధిలో ఉన్న స్థలం గత 70 సంవత్సరాలుగా ఆరేపల్లి చెన్నకేశవుల అనుభవంలో ఉందని, పూరిగుడిసె, వామిదొడ్డి, గేదెలకొట్టం వేసుకుని ఉన్నారని, ఈ స్థలం గురించి గత సోమవారం స్పందనలో కొంతమంది వ్యక్తులు స్వార్థంతో ఫిర్యాదు వారు తహసీల్దార్‌కు తెలిపారు. ఆ స్థలానికి ఎస్‌పీజీపాలెం వాసులకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.

చదువుతోపాటు నైపుణ్యాలు కలిగి ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీలలో నైపుణ్యాలు కలిగి ఉండాలని బ్రహ్మకుమారి సరస్వతి అన్నారు. స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరియా విశ్వవిద్యాలయ కార్యాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని బ్రహ్మకుమారి ఓంశాంతి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు శ్రీకృష్ణ, చిత్రలేఖన పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీలు ప్రారంభించి సరస్వతి మాట్లాడుతూ.. బాల్యం నుంచే మంచి అలవాట్లు కలిగి తల్లిదండ్రుల, గురువుల పట్ల భక్తి కలిగి ఉండాలన్నారు. తరగతి గదులలో నేర్చుకున్న అంశాలతో పాటు విజ్ఞాన విషయాలు తెలుసుకోవాలన్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ఈనెల 18న బహుమతులు అందిస్తామని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం రూరల్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేని వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కోరారు. మీ ప్రాంతాలలో ఏమైనా ఘటనలు జరిగితే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెద్దదోర్నాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ ఎన్.సావిత్రి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నష ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ పలువురు యువకులు మద్య పానం, ధూమపానం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు మందుకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఇంటికి, దేశానికి ఉపయోగపడాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖాధికారి హబీబ్‌ఖాన్, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, మహిళా పోలీసు అనంతలక్ష్మి, అధ్యాపక సిబ్బంది విజయ బాబు, రమేష్, ఫిలిప్స్, జయసింహ పాల్గొన్నారు.

ఎస్ఐగా సాంబశివయ్య బాధ్యతలు



సాంబశివయ్య

పెద్దారవీడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు ఎస్ఐగా సాంబశివయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై దృష్టి సారిస్తానన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి కూడళ్లైన దేవరాజుగట్టు, కుంటలలో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్య లు తీసుకుంటానన్నారు. సాంబశివయ్యకు స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని ఇసుక రీచ్‌లో లారీ ఓనర్ల నెలకొన్న సమస్యలు తీర్చాలని లారీ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గొందిలి కాశీరామ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఉచిత ఇసుక ప్రకటన సీఎం చంద్రబాబు చేశారని తెలిపారు. మార్కాపురం పరిధిలో ఇసుక రీచ్ లేనందున నెల్లూరు నుంచి ఇసుక రవాణా చేస్తున్నారని, ఇసుక యార్డును ఒక కాంట్రాక్టర్‌కు ఇచ్చారన్నారు. లారీ ఓనర్లను కాంట్రాక్టర్ పిలిపించి మాట్లాడాక టన్ను ఇసుకకు రూ.950కి రవాణా చేస్తున్నామన్నారు. గత నెలలో లారీ ఓనర్లతో కాంట్రాక్టర్ సమావేశం ఏర్పాటు చేసి రూ.800 కంటే ఎక్కువ ఇవ్వలేరని చెప్పారని కాశీనాథ్‌కు తెలిపారు. ఇసుక యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించి తమకు జీవనాధారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాలాజీ సింగ్, కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి పఠాన్ సఫీవుల్లా ఖాన్, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధుడిపై యువకుడు దాడి

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌పై వెళ్తూ ఓ వృద్ధున్ని ఢీకొట్టడమేకాక దాడిచేసి గాయపరిచిన యువలకులపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌వీకేపీ కాలేజీలో అటెండర్‌గా పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగి గోగిరెడ్డి కాశయ్య ఈ నెల 9న కూరగాయాల మార్కెట్‌కు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక రాజ్యలక్ష్మి కాలనీకి చెందిన ఇద్దరు యువకులు వేగంగా మోటార్ సైకిల్‌పై వెళ్తూ అదుపుతప్పి కాశయ్యను ఢీకొట్టారు. కిందపడిన కాశయ్య యువకులను మందలించారు. దీంతో యువకులు రెచ్చిపోయి కాశయ్యపై చేతులు, కాళ్లతో దాడి చేశారు. గాయాలపాలైన కాశయ్యను కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరులోని అమరావతి వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రస్తుతం కాశయ్య అపస్మారక స్థితిలో ఉన్నట్లు తెలిపారు. కాశయ్య భార్య సుబ్బమ్మ బుధవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సొసైటీ అధ్యక్షులు

రైతులకు మెరుగైన సేవలందించాలి

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నూతన సొసైటీ ప్రెసిడెంట్‌లకు సూచించారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మార్కాపురం, మిట్టమీదిపల్లి సొసైటీ ప్రెసిడెంట్లు జవ్వాజి రామాంజులరెడ్డి, గొలమారి నాసర్‌రెడ్డిలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల శ్రీనివాసులు, మట్టం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒడా చైర్మన్‌కు అభినందనలు



రియాజ్‌కు అభినందనలు తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

మార్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒడా చైర్మన్‌గా నియమితులైన షేక్ రియాజ్‌ను మార్కాపురం జనసేన నాయకులు బుధవారం ఒంగోలులో కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన రియాజ్‌కు కూటమి ప్రభుత్వం సరైన గుర్తింపును ఇచ్చిందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ అన్నారు. కార్యక్రమంలో పేరూరి రమేష్, షేక్ ఖాశింవలి, బి.కొండల్, డి.కాశిం, దమ్మని చందు, షేక్ మస్తాన్, శివకృష్ణ పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలి




సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రాచర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి అన్నారు. రాచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, సభ్యులుగా బత్తిని రాజశేఖర్ గువ్వా ఎర్ర పిచ్చయ్య బుధవారం స్థానిక సొసైటీ బ్యాంకులో ప్రమాణ స్వీకారం చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా ప్రభుత్వం సొసైటీలు, రైతుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి సహకారం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణకిషోర్‌రెడ్డి కోరారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీ బ్యాంక్‌ల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. అనంతరం ఆయన నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, సభ్యులను అభినందించి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ దుత్త బాలీశ్వరయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు కటిక యోగానంద్, నాయకులు అంబవరం శ్రీనివాస్‌రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, ఉలాపు శంకర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు గురైన బాలిక కుటుంబాన్ని ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి, నియోజకవర్గ వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులకూ పిల్లల విషయంలో బాధ్యత ఉండాలన్నారు. వారితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవోగా హేమలత బాధ్యతలు



హేమలత భాస్కర్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా టీ హేమలత భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హేమలతభాస్కర్ గుంటూరు జిల్లా పత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-1 సూపర్‌వైజర్ గా విధులు నిర్వహిస్తూ సీడీపీవోగా ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు అంగన్‌వాడీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగుంట్ల గ్రామంలో ఎరువుల షాపుపై బుధవారం వ్యవసాయశాఖ అధికారులు ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో బుజ్జిబాయి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆ షాపులో అనుమతులు లేకుండా నిల్వ ఉన్న రూ.74,400 విలువగల ఎరువులను అమ్మకాలు జరపకుండా నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అనుమతులు లేకుండా రైతులకు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై ఆందోళనకు సిద్ధం

గిద్దలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వద్దు - ట్రు అప్ చార్జీలు రద్దు అనే నినాదంతో భవిష్యత్తు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు వి.బాలకోటయ్య అన్నారు. గిద్దలూరు ఏరియా పార్టీ సర్వసభ్య సమావేశంలో బాలకోటయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆవులయ్య, నరసింహులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు జీతాల్లేవు

మండల సమావేశంలో నిలదీసిన ఎంపీటీసీ సభ్యుడు ఫకీరయ్య



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఫకీరయ్య

పెద్దారవీడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నికైన ఆరు నెలలు మాత్రమే సర్పంచ్‌లు, ఎంపీటీసీ స భ్యులకు జీతాలిచ్చి, ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకూ జీతాలు ఇవ్వలేదని.. అధికారులు, పింఛన్‌దారులు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పింఛన్లు తీసుకుంటున్నారు.. మా పరిస్థితి ఏమిటలని కలనూతల ఎంపీటీసీ సభ్యుడు దూదేకుల ఫకీరయ్య అధికారులను నిలదీశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారుల నివేదికలపై ప్రజాప్రతినిధులు స్పందించారు. రామాయపాలెం సర్పంచ్ పొందుగుల వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన అధికారులెవరూ సమావేశాలకు రారని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన గ్రామ సభలు జరగడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై విద్యాశాఖ, అంగన్‌వాడీ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప ఆయా నిర్మాణాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. జడ్పీటీసీ సభ్యుడు చలమారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జాన్ సుందరం, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు

రాచర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో ఉన్న విద్యార్థులను సంరక్షించే విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎంఈవో షేక్ మొయినుద్దీన్ అన్నారు. మండలంలోని అనుములవీడు హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక కిడ్నాప్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు, పోలీసులు సకాలంలో స్పందించి పాపను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాలలో పనిచేసే సిబ్బంది విద్యార్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు కృతజ్ఞతా ర్యాలీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన నేపథ్యంలో గురువారం కృతజ్ఞతా ర్యాలీ జరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి రైతులు ట్రాక్టర్లు, మోటార్ బైకులతో అన్నదాత సుఖీభవ ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున రైతులు ర్యాలీలో పాల్గొని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలపాలని కోరారు.

మార్కాపురం : కృతజ్ఞతా గురువారం సాయంత్రం ర్యాలీ జరుగుతుందని పట్టణ, మండల పార్టీల అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కాకర్ల శ్రీనివాసు తెలిపారు. స్థానిక అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు.

అవినీతి రహిత సమాజంపై వ్యాసరచన

గిద్దలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇండో ఉన్నత పాఠశాలలో ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేస్తామని వేదిక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మదిరె రంగ సాయిరెడ్డి ఈసందర్భంగా తెలిపారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న కంభం సొసైటీ సభ్యులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి సొసైటీ సభ్యుల సన్మానం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కంభం సొసైటీ బ్యాంక్ నూతన కమిటీ సభ్యులను నియమించగా వారు బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కంభం సొసైటీ బ్యాంక్ చైర్మన్ కేతం శ్రీను, మెంబర్లు కర్నం బాలకోటయ్య, సందు వరలక్ష్మి నియమితులవగా వారితోపాటు మండల పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. నూతనంగా ఎన్నికైన వారికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కంభం మండలపార్టీ అధ్యక్షులు తోట శ్రీను, మండల నాయకులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణశాఖ హెచ్చరిక మేరకు కురుస్తున్న వర్షాలు మరో మూడు రోజులపాటు భారీగా పడనున్న దృష్ట్యా ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కాలువలు, వంకలు, చెరువులు ఉధృతంగా ప్రవహించే పరిస్థితి ఉందని ప్రజలు అటువైపు వెళ్లవద్దని అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు తలెత్తిన పక్షంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆగస్టు 15, 16, 17 తేదీలలో పాఠశాలలకు సెలవులు ఉన్నందున ఆసమయంలో పిల్లలు ఈతకు వెళ్లడం, చెరువులు, వాగుల్లో ఆడుకోవడం చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

గిద్దలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రధాన వీధుల గుండా రాచర్ల గేటు వరకు తిరంగ ర్యాలీ జరిగింది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ ర్యాలీలో ముఖ్యఅతిథిగా హాజరై ఎంతో మంది నాయకుల, ప్రజల త్యాగఫలితమే దేశానికి వచ్చిన స్వాతంత్ర్యమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.వి.రామాంజనేయులు, బిజెపి నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, కొప్పరపు నాగేశ్వరరావు, ఆలపాటి సాయిచరణ్, సంతోష్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లుల చెల్లింపునకు అనుమతి

- 2014-19 వరకు చేసిన పనులకు నగదు అందని వారు వివరాలు ఇవ్వాలి
- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



అధికారులతో సమావేశమైన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఉపాధి హామీ పథకం నిధులతో 2014 నుంచి 2019 వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. బుధవారం ఉపాధి హామీ ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, గ్రా మీణ తాగునీటి పథకం ఇంజనీర్లు, ఎంపీడీవోలతో జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు ఉపాధి నిధులతో నీటి కుంటల నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణం, శ్మశానాల అభివృద్ధి పనులను టీడీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లరకు 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా బిల్లులు చెల్లించలేదన్నారు. పనులు చేసిన వారు నష్టపోకుండా ప్రజా ప్రభుత్వం ఇప్పుడు బిల్లులు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. వారంలోగా పనులు చేసి బిల్లులు అందని వారు పూర్తి వివరాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయాలని ఎరిక్షన్‌బాబు సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఐదు మండలాల ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నల్లమలలో భారీ వర్షం

- దొంగలవాగు ఉధృతి
- నిలిచిన రాకపోకలు

పెద్ద దోర్నాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి బుధవారం ఉదయం 4గంటలకు మళ్లీ దొంగల వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అటవీ ప్రాంతంలో మోస్తరు నుంచి భారీ వర్షం నమోదు కావడంతో వరదనీరు అటవీ ప్రాంతంలోని దొంగల వాగు గుండా కొత్తూరు సమీపంలోని జాతీయ రహదారిపై నిర్మించిన చిన్న చప్టా మీదుగా ప్రవహించడంతో వాహనాలు రెండు గంటల పాటు స్తంభించి పోయాయి.



కనిగిరిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, ఛైర్మన్ తదితరులు

స్వాతంత్ర్య పోరాట వీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఛైర్మన్ గఫార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఆజాదీకా అమృత్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో త్రివర్ణ పతాకాలు చేబూని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పామూరు బస్టాండు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశభక్తిని చాటాలన్నారు. ఛైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి ప్రజలందరూ దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత 200 అడుగుల జాతీయజెండాను పట్టుకుని నగర వీధుల్లో 'వందేమాతం, భారత్‌మాతాకీ జై' అంటూ చేసిన నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఎన్జీవో నాయకుడు పీవీ రమణారెడ్డి, ఆర్ఐ ప్రదీప్, కౌన్సిలర్ తమ్మినేని సుజాత, పులి శ్రీను, సచివాలయ, మెప్మా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రైతులను కార్యాలయాలకు తిప్పుకుంటే మాత్రం సహించేది లేదని తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ హెచ్చరించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌వోలు రైతులను పదే పదే ఒకే పని పై కార్యాలయం చుట్టూ తిప్పుకోవటం మంచి పద్ధతి కాదన్నారు. నిర్ణీత గడువు లోపల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాని పక్షంలో తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తానన్నారు. కొందరు వీఆర్‌వోలు ప్రతి పనికి డబ్బులు అడుగుతున్నట్టు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం అయ్యిందని, అలాంటి వీఆర్‌వోలను క్షమించే ప్రసక్తే లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, వీఆర్‌వోలు గురవయ్య, శేషగిరిరావు, కోటయ్య, రాఘవరెడ్డి, సుజాత, పెద్దన్న, వేణుగోపాల్‌రెడ్డి, తేజ పాల్గొన్నారు.



మంగళగిరిలో నారా బ్రాహ్మణితో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

నారా బ్రాహ్మణితో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణితో కలిసి టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళగిరిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళగిరిలో నూతనంగా లక్ష్మి శారీస్ అండ్ డ్రస్ మెటీరియల్ షోరూమ్‌ను ప్రారంభించారు. చేనేతలకు అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి మహిళలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ నారా బ్రాహ్మణితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు.

కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో నష్టం

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

కనిగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అన్నారు. కనిగిరిలో రెండో రోజు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడి తగ్గిపోవటం వలన రైతులకు గిట్టుబాటు ధరలు తగ్గిపోతాయని తెలిపారు. సభలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జాలా అంజయ్యలు ప్రసంగించగా నెరసుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి అంజనేయులు, గుమ్మా బాలనా గయ్య, సంపూర్ణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వరుల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ ఆపాలంటూ ఫిర్యాదు

కనిగిరి పట్టణంలోని పాతూరు ప్రాంతంలోని సర్వే 491/2 లో 30 సెంట్లు భూమికి జరుగుతున్న అక్రమ రిజిస్ట్రేషన్‌ను ఆపాలని కోరుతూ గోచిపాత రాజేష్ సబ్‌రిజిస్ట్రార్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

దర్శి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దర్శి పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు, ఎస్వీఆర్ కాలేజీ విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు, నాయకులు గురువర్ధనరావు, కాకర్ల నాగసాయి, అమరేశ్వరరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

దొనకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన 79వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ ఎఫ్రాయిమ్ బుధవారం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. బాలికలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్, బాలురులకు రన్నింగ్ రేస్, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించగా విద్యార్థులు పోటాపోటీగా ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 15వ తేదీన బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలకు పొంగుతున్న వాగులు

- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు

దర్శి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలకు నీరు చేరి జలమయమవుతున్నాయి. దర్శి పట్టణ సమీపంలో కాటేరువాగు వర్షం వచ్చిన ప్రతిసారీ పొంగి ప్రవహిస్తున్నది. ఈ కాటేరువాగు పూర్తిగా ఆక్రమణలకు గురికావటంతో ఈ దుస్థితి నెలకొంది. సుమారు 50 ఎకరాలకు పైగా విస్తీర్ణం కల్గిన ఈ కాటేరువాగు ఇరువైపులా ఆక్రమణలకు గురికావటంతో కుచించుకుపోయింది. వెడల్పు పూర్తిగా తగ్గటంతో భారీ వర్షం వచ్చినప్పుడు పొలాల్లో నీరంతా ఈ వాగులోకి చేరటంతో ముందుకు వెళ్లే వీలులేక దర్శి-పొదిలి ప్రధాన రహదారి బ్లాక్ అవుతోంది. కాటేరువాగు ప్రాంతంతో స్థలాల రేట్లు విపరీతంగా పెరిగాయి. అక్కడ సెంటు ధర రూ.10 లక్షలకు పైగా ఉంది. దీంతో అనేక



దర్శి పట్టణ సమీపంలో ప్రవహిస్తున్న కాటేరు వాగు

మంది వాగు స్థలాన్ని ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకున్నారు. మరికొంతమంది ఇతర కట్టడాలు నిర్మించి స్వంత స్థలాల్లో కలుపుకున్నారు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు కాటేరువాగు ఉధృతి ప్రమాదకరంగా మారింది. దర్శి-పొదిలి ప్రధాన రహదారిపై నీరు భారీగా నిలవటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. గతంలో ద్విచక్ర వాహన చోదకులు ఈ వాగులో కొట్టుకొనిపోయారు. చుట్టుపక్కల వారు ప్రమాదం నుంచి వారిని రక్షించటంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ వాగు ఆక్రమణలను తొలగించాలని ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. అందువలన తరచూ కాటేరువాగు వర్షం పడినప్పుడల్లా పొంగుతోంది. గడియా స్తంభం సెంటర్‌లో రోడ్లపై పడిన నీరు మురుగు కాల్వలు లేకపోవటంతో రోడ్లపైనే నిలుస్తోంది. అధికంగా నీరు వస్తే తహసీల్దార్ కార్యాలయం కుంటలా మారుతోంది. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో కూడా వర్షంనీరు గ్రౌండ్‌లోకి చేరి నిల్వ ఉంటోంది. అధికారులు స్పందించి వాగుల ఆక్రమణలు తొలగించాలని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



దర్శి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

కురిచేడులో భారీ వర్షం

కురిచేడు: కురిచేడులో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి కూడా ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడుతున్నాయి. పొగాకు సాగు చేసే రైతులు నాట్లు వేసేందుకు సిద్ధం అయ్యారు. బుధవారం అక్కడక్కడా నాట్లు వేశారు. ఇప్పటిదాకా కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతుండగా ఈ వర్షం వారికి జీవనోపాధి కల్పించినట్లు అయింది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెట్టపైర్లు సాగు చేయడంతో పాటు వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం చేయూత

● సమస్యల పరిష్కారంతో ఆనందోత్సాహాలు

దొనకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన తదితర కీలకమైన ఆరోగ్య సేవలను అందించటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపికబురుతో చేయూతనందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జీవో 94 మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో మండలంలోని గ్రామాల్లో ఆశా కార్యకర్తలుగా పనిచేస్తున్న 48 మంది జీవనోపాధికి ఎంతో ప్రయోజనం చేకూరింది. ఆశా కార్యకర్తల సంక్షేమం కోసం ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంది. ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచటం, ఇతర ఏ రాష్ట్రాల్లో లేని విధంగా గ్రాట్యూటీ కింద రూ.1.50 లక్షలు చెల్లించేలా ఆమోదం తెలిపింది. అలాగే వేతనంతో కూడిన పూర్తిజీతంతో 180 రోజులు, ఆరు నెలలు ప్రసూతీ సెలవులు మంజూరు చేయటం మరో కీలకమైన నిర్ణయం. కూటమి ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ప్రయోజనం చేకూరేలా ఉత్తర్వులు జారీచేయటం పట్ల ఆశా కార్యకర్తలు టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల సమావేశమైన దొనకొండ మండలంలోని ఆశా కార్యకర్తలు (ఫైల్)

సేవలకు గుర్తింపు



- వై. నాగేంద్రమ్మ, ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు, దొనకొండ

గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ ఉద్యోగుల్లా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయటం ఎంతో సంతోషకరం. ప్రభుత్వ కొత్త నిర్ణయాలతో గ్రామాల్లో ఆశా కార్యకర్తలు మరింత ఉత్సాహంగా సేవలందించేందుకు ప్రోత్సాహన్ని అందించింది.

పోరాటాలతోనే సాధ్యం

- చిరుపల్లి అంజయ్య, సీఐటీయూ మండల కన్వీనర్



సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్నో విడతలుగా ఆశా కార్యకర్తలు చేపట్టిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, పోరాటాల ఫలితంగానే తమ హక్కులను కూటమి ప్రభుత్వంలో ఆశా కార్యకర్తలు కొంతమేర పరిష్కరించుకున్నారు.

రైతులు ఈక్రాప్ చేయించుకోవాలి

పీసీపల్లి,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను రైతులందరూ ఈక్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాకృష్ణ అన్నారు.మండలంలోని నేరేడుపల్లి, మారెళ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన కంది, సజ్జ, మినుము, వరి, ఎండుమిరప తదితర పంటలకు రైతులందరూ పీఎం ఫసల్ బీమా చేయించుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



నేరేడుపల్లిలోని రైతుసేవా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో రంగాకృష్ణ

జొన్న గడ్డి విత్తనాలు మంజూరు

సీఎస్‌పురం(పామూరు) : పామూరు, సీఎస్‌పురం మండలాలకు రెండు వేలు వంతున రెండు మండలాలలకు 4 వేల కేజీల జొన్నగడ్డి విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు సీఎస్‌పురం పశుసంవర్థకశాఖ సంచాలకులు డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం రాయితీతో ఒక్కో పశుపోషకునికి 5 కేజీల వంతున జొన్నవిత్తనాలు అందజేస్తున్నామని, కావాలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

బీమా నమోదు చేయించు కోవాలి

ముండ్లమూరు : మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ప్రతి పంటకు బీమా నమోదు చేయించుకోవాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి ఏ. తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని సింగనపాలెం, వేంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలసి మొక్కజొన్న తదితర పైర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీ కీర్తిరావు, ఏఈవోలు, వ్యవసాయ అధికారులు వీరాంజనేయులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

పామూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కట్టకిందపల్లి గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు జనసేన కనిగిరి అసెంబ్లీ పాయింట్ ఆఫ్ వ్యూ వరికూటి నాగరాజు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సహాయ సహకారాలతో నూతన ఆలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో బుధవారం ప్రాతః కాలహోమాలు, యంత్రస్థాపన, పూర్ణాహుతి తదితర పూజలను రుత్వికులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌ఛైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ నీరుకట్టు హరిబాబు, నాగిశెట్టి బ్రహ్మయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు, గ్రామస్థులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు నాగరాజు

టీడీపీ నేత యారవకు సన్మానం

పామూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో బుధవారం జరిగిన రైతుసంబరం కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి ఏఎంసీ ఛైర్‌పర్సన్ రమాదేవి భర్త టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులును స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా రమాదేవిని నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడం ఆనందంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు గోళ్ల బాస్కర్‌రావు, మోపాడు ప్రాజెక్టు సూపర్ ఛైర్మన్ చుంచు కొండయ్యలు అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మన్నం రమణయ్య, ఏలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలి

ముండ్లమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతే పరమావధిగా భావించి పని చేసి వారి ఆదరాభిమానాలు పొందాలని టీడీపీ దర్శి నియోజక వర్గ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ అన్నారు. మండలంలోని మారెళ్ల సొసైటీ అధ్యక్షుడిగా బుర్రి అంజయ్యను ఎన్నిక చేయటంతో బుధవారం డాక్టర్ లలిత సాగర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లలిత సాగర్ మాట్లాడుతూ రైతుల ఆశయాలకు అనుగుణంగా పని చేసి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సీనియర్ టీడీపీ నాయకుడు మట్టా సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ జాతీయ జెండా ప్రదర్శన

కురిచేడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కురిచేడులో గురువారం 365 అడుగుల జాతీయ జండాను ప్రదర్శించనున్నట్లు తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



గొట్టిపాటి హనుమంతరావు ఎత్తిపోతల పథకం వద్ద చిల్లచెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

గొట్టిపాటి హనుమంతరావు ఎత్తిపోతల పథకానికి మోక్షం

● రూ. 20 లక్షల సొంత నిధులతో మరమ్మతులు
● మొదలైన జంగిల్ క్లియరెన్స్ పనులు
● టీడీపీ ఇన్‌చార్జ్ లక్ష్మికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన పోలవరం గ్రామస్థులు

ముండ్లమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలకలేరు వాగుకు సమీపంలో పోలవరం రైతుల శ్రేయస్సు కోసం నిర్మించిన గొట్టిపాటి హనుమంతరావు ఎత్తి పోతల పథకం కొన్ని సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉంది. ఈ ఎత్తిపోతల పథకం కింద పోలవరం గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి 805 ఎకరాలు బీడు భూములుగా మారాయి. దీంతో టీడీపీ దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దంపతులను ఈనెల 7వ తేదీన రైతులు కలిసి తమ గ్రామానికి జీవనాధారమైన మాజీ మంత్రి, స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు ఎత్తి పోతల పథకం మూలనబడిన విషయాన్ని వారి దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఐడీసీ అధికారులతో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న విషయం తెలిపారు. ఐడీసీ అధికారులు మరమ్మతులు చేయటానికి గాని, ట్రాన్స్‌ఫార్మర్ అమర్చటానికి గాని తమ వద్ద నిధులు లేవని, రైతులే భరించాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే స్పందించి డాక్టర్ లక్ష్మి, లలిత సాగర్ దంపతులు ఎత్తి పోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరమ్మతులకు అయ్యే రూ. 20 లక్షల నిధులను తాము సొంతంగానే భరించి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే బుధవారం ఎత్తి పోతల పథకం వద్ద చిల్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఇక పనులు ప్రారంభం కావటంతో గ్రామస్థులు ప్రత్యేకంగా లక్ష్మి, లలిత సాగర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

● వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

తాళ్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :మాదక ద్రవ్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని వీకేఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు.స్థానిక వీకేజూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా వైస్‌ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలనునాశనం చేసుకోవద్దన్నారు. వాటికి దూరంగా ఉండి మంచి నడవడికతో ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తములుగా ఎదగాలని సూచించారు.హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే లక్ష్యాలను ఎంచుకుని, కుటుంబస్థితులను గుర్తించుకుని బాధ్యతగా చదువుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో లెక్చరర్లు గురవయ్య, రాజశేఖర్, లక్ష్మయ్య, సాయిలక్ష్మి, లలితాబోస్, పార్వతీబాయ్, సిబ్బంది బ్రహ్మారెడ్డి, శేషగిరి, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బరామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం ఆనందదాయకం

దర్శి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం ఆనందదాయకమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు.

రైతు ట్రాక్టర్ల ర్యాలీ వాయిదా

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దర్శిలో చేపట్టిన రైతుల ట్రాక్టర్ల ర్యాలీ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమచేసిన శుభసందర్భంగా కృతజ్ఞతగా రైతులు ట్రాక్టర్ల ర్యాలీ గురువారం చేపట్టాలని నిర్ణయించారన్నారు. వర్షాల కారణంగా ప్రస్తుతం ఈ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేశామని, వర్షాలు తగ్గిన తరువాత తిరిగి నిర్వహిస్తామని తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయంలో పూజలు

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురు స్వాములు పిడుగు ఆదినారాయణ, నరసయ్యలు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏపీవో బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):పీసీపల్లి మండలం ఏపీవోగా కె.కొండయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన గతంలో ముండ్లమూరు ఏపీవోగా పనిచేస్తూ పీసీపల్లికి బదిలీపై వచ్చారు.బుధవారం స్థానిక ఎంపీడీఓ హనుమంతరావును కలిసి జాయినింగ్ రిపోర్టు చేసిన కొండయ్య ప్రస్తుత ఇన్‌చార్జ్ ఏపీవో జహంగీర్‌బాషా నుంచి చార్జ్ తీసుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు జాతీయ జెండాల అందజేత

తాళ్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు బీజేపీ నాయకులు జాతీయ జెండాలను బుధవారం అందజేశారు.ప్రతివ్యక్తి దేశభక్తిని మరింత పెంచుకునేందుకు తమ వంతు చేయూతగా పార్టీ ఆదేశానుసారం ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను అందజేసినట్లు సీనియర్ బీజేపీ నాయకులు మారం గోవిందరెడ్డి తెలిపారు.

ముండ్లమూరు వీఆర్‌వోగా శేషగిరిరావు

ముండ్లమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం గ్రామ రెవెన్యూ అధికారిగా పోగుల శేషగిరిరావును నియమిస్తూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా పని చేసిన బ్రహ్మతేజ తిరిగి నాయుడుపాలెం వీఆర్‌వోగా వెళ్లారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి దేవదాయ శాఖ 1987 సెక్షన్ 18 ప్రకారం 20 రోజుల్లో ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ వేయనున్నట్లు దేవస్థాన ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడిన 20 రోజుల్లో నమూనాఫారం -2 ద్వారా కార్యనిర్వాహణాధికారి గారికి దరఖాస్తులను పంపాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 14 ఆగస్టు 2025





బాపట్ల మండలంలో నీటమునిగిన పొలాలను రైతులు, నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పర్చూరు మండలం స్వర్ణ సమీపంలో పొలాల్లో చేరిన వర్షపు నీరు

నేడు పాఠశాలలకు సెలవు

భారీవర్షాల నేపథ్యంలో, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ పురుషోత్తం తెలిపారు. అన్ని యాజమాన్య ప్రైవేట్ పాఠశాలలకు సెలవు వర్తిస్తుందని చెప్పారు.

వర్ష బీభత్సం

జిల్లా వ్యాప్తంగా ముంచెత్తిన వాన

- కుంభవృష్టితో జన జీవనం అస్తవ్యస్తం
- ఉప్పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు సహా పలు గ్రామాలు జలదిగ్బంధం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు నీటిని కుమ్మరిస్తున్నాయా.. అన్నట్లుగా మంగళవారం అర్ధరాత్రి, బుధవారం సాయంత్రం జిల్లాలో వర్ష బీభత్సం సృష్టించింది. గంటల తరబడి ఏకధాటిగా కురిసిన వర్షంతో జనం వణికిపోయారు. కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలు, ప్రధాన రహదారులను వాన నీరు ముంచెత్తింది. మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో నిద్రలో ఉన్న వారు కూడా వణికిపోయారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఏమి జరుగుతుందోనని ప్రజలు భీతిల్లిపోయారు. బుధవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో తెరిపిచ్చినా సాయంత్రం మళ్లీ వరుణుడు వణికించాడు. తెరిపి ఇవ్వకుండా కురిసిన వర్షంతో వాగులు, డ్రెయిన్లు, కాల్వలు పొంగి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. పట్టణాల్లోని శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాలతో పాటు పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వాన నీటి ముంపుతో పంట పొలాలు సైతం తటాకాలను మరిపిస్తున్నాయి. పలు మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులు ఇదేరీతిన వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలు అటు రైతులను, ఇటు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.



కొల్లూరు మండలంలో పసుపులో నిలిచిన వర్షం నీరు

మృతి చెందిన నేలపాటి భరత్

గుర్తు తెలియని మృతదేహం

ఇద్దరు మృతి

రాజుపాలెం మండలంలోని కొండమోడు సమీపంలోని కోతుల వాగులో 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం బుధవారం కొట్టుకువచ్చింది. ఇతడి వివరాలు తెలియ లేదు. నంబూరులో వాగు ఉధృతికి అదే గ్రామానికి చెందిన నేలపాటి భరత్(14) గల్లంతయ్యాడు. స్థానిక జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు వాగును చూసేందుకు వెళ్లి జారిపడి కొట్టుకుపోగా గజ ఈతగాళ్లు మృతదేహాన్ని వెలికితీశారు.

పెదకూరపాడు - అబ్బరాజుపాలెం గ్రామాల మధ్యలోని లోలెవల్ చప్టా వద్ద తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై వెళుతున్న సాగర్, సన్నీ అనే ఇద్దరు యువకులు వాగులో కొట్టుకుపోయారు. వారిని పోలీసులు రక్షించారు.



కొరిశపాడు మండలం దైవాలరావు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో చేరిన నీరు



కారంచేడు మండలం స్వర్ణ సమీపంలో పూర్తిగా నీటమునిగిన పొలాలు




అరవింద వారధి వద్ద ఉధృతంగా వరద ప్రవాహం



బాపట్ల : రామకృష్ణాపురంలో పూరింట్లోకి చేరిన వర్షపునీరు



చీరాలలో తటాకాన్ని తలపిస్తున్న రహదారి



- అమరావతి ధ్యానబుద్ధ వద్ద కృష్ణమ్మ పరవళ్లు



రేపల్లె పట్టణం జగనన్నకాలనీలో గృహాల మధ్యకు చేరిన వర్షపునీరు

జిల్లా స్థాయిలో.. కంట్రోల్ రూమ్ 08643-220226

జిల్లాలో.. హై అలర్ట్

ముంపు భయంతో లంకవాసుల వణుకు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా అంతటా జలదిగ్బంధంగా మారింది. అనేక ప్రాంతాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా కేంద్రం బాపట్లతో పాటు పలు పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు తీవ్రంగా ఇక్కట్లకు గురయ్యారు. భారీ వర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో హైఅలర్ట్‌ను (మిగతా 6వ పేజీలో)

నిండుకుండల్లా జలాశయాలు

ఇప్పటికే జలాశయాలు నిండుకుండల్లా ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలతో ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,28,141 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో బుధవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు ఎత్తిపోతల జలకళను సంతరించుకుంది. 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు దుముకుతూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. దీంతో అధికారులు బ్యారేజి 70 గేట్లను పూర్తిగా ఎత్తి వరదనీటిని సముద్రంలోకి విడుదల చేశారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక

హార్బర్‌లో 3వ నెంబర్ హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు పడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఈ క్రమంలో నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికను ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రం లో వేట చేసే పరిస్థితి లేకపోవడంతో మత్స్యకారులు హార్బర్‌కు చేరారు. మత్స్యకారలు వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు.



చీరాల-బాపట్ల రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



సత్తెనపల్లిలోని చల్లా వారి వీధిలో నాగమల్లేశ్వర రావుకు చెందిన గృహం కూలింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సూపర్ పవర్‌గా భారత్

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత్ సూపర్ పవర్ దేశంగా ఎదుగుతోందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమెరికా, చైనా తర్వాత ఆర్థిక ప్రగతిలో భారతదేశం మూడో స్థానంలో నిలుస్తుందన్నారు. జాతీయ సమైక్యతకు చిహ్నంగా ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ జెండాపండుగను ప్రతిఒక్కరు జరుపుకోవాలన్నారు. ర్యాలీలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణసంస్థ పీడీ వెంకటేశ్వరరావు, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.



హర్‌ఘర్ తిరంగ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన తదితరులు

పోలీసు యంత్రాంగం అప్రమత్తం కావాలి : ఎస్పీ

బాపట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ చప్టాలు, కల్వర్టులపై నుంచి ప్రమాదస్థాయిలో వరదనీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్ళే ప్రయత్నం చేయవద్దన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటి ఉధృతి కారణంగా ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు భారీగా వరదనీటిని విడుదల చేస్తున్నారని తెలిపారు. అందువల్ల కృష్ణానది పరివాహక లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు పోలీసుశాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తక్షణం పోలీసు సహాయం అవసరమైతే 100/12 టోల్‌ఫ్రీ నెంబర్లకు డయల్ చేయాలన్నారు.

అమరావతిలో బసవతారకం హాస్పటల్

భూమి పూజ చేసిన చైర్మన్ బాలకృష్ణ ● హాజరైన స్పీకర్, మంత్రులు

తుళ్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బసవతారకం ఇండో - అమెరికన్ హాస్పటల్ నిర్మాణానికి రాజధాని గ్రామం తుళ్ళూరు వద్ద బుధవారం ఉదయం ఆసుపత్రి చైర్మన్ సినీ నటుడు బాలకృష్ణ భూమి పూజనిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాజధానిలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ అభివృద్ధి చేస్తోందన్నారు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ద్వారా భవిష్యత్తులో అధిక నాణ్యత క్యాన్సర్ చికిత్సను ఇతర ప్రాంతాలకు విస్తరించడమే కాకుండా అవసరమైన చోట ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ నిబద్ధతతో పని చేస్తుందన్నారు. 21 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఆసుపత్రి 500 పడకల సామర్థ్యంతో 750 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. 2028 నాటికి ఆపరేషన్లు ప్రారంభమవుతాయనే అంచనాతో ఉన్నామన్నారు. రెండో విడతలో ఆసుపత్రిని 1000 పడకలకు పెంచుతామన్నారు. సంస్థకు దాతలు, భాగస్వాములు, శ్రేయోభిలాషులు , కమ్యూనిటీ సభ్యులు అందిస్తున్న నిరంతరాయమైన మద్దతు తెలిపిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బాలకృష్ణ అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్న పాత్రుడు, మున్సిపల్ శాఖ మంత్రి పీ నారాయణ, ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్, ఉండవల్లి శ్రీదేవి, ఆంధ్ర ప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, చైర్మన్, అమరావతి డెవలెప్మెంట్ కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, డాక్టర్ దత్తాత్రేయుడు నోరి, డాక్టర్ పోలవరపు రాఘవరావు, డాక్టర్ గడ్డం దశరథ రామిరెడ్డి, శ్రీ జెయస్ ఆర్ ప్రసాద్, నారా బ్రాహ్మణి ట్రస్టు బోర్డు సభ్యులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద మాట్లాడుతున్న బాలకృష్ణ, డాక్టర్లు

స్ట్రయిట్‌కట్ మలుపునకు అనుమతి

రెండు వర్గాల ఆమోదంతో పనులు చేపట్టాలన్న కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా రైతులు, మత్స్యకారుల మధ్య స్ట్రయిట్‌కట్ మలుపు వివాదానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పరిష్కరించారు. లైన్ డిపార్ట్‌మెంట్,రైతు, మత్స్యకార సంఘసభ్యులతో కలెక్టర్ జె.వెంకటమురళి బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాల్వ మలుపుకు అనుమతిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. రెండువర్గాల ఆమోదంతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులు, మత్స్యకారులను దృష్టిలో పెట్టుకుని జెట్టి నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా కాల్వను కొంత మేరకు మలుపు తిప్పాలన్నారు. మలుపు వల్ల భూమినష్టపోయిన రైతుకు మత్స్యశాఖ ద్వారా పరిహారం వచ్చేలా చూడాలన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా సీమౌత్ దగ్గర కొంత వెడల్పునకు శాశ్వత పరిష్కారం చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఇరువర్గాలు ఒక నిర్ణయానికి రావాలని ఎవరికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య తెలిపారు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ గతంలో రైతుల కోసం నిర్మించారన్నారు. మత్స్యకారుల కోరిక మేరకు గతంలో వారిపై పెట్టిన కేసులను రద్దు చేశామని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, మత్స్యశాఖ డీడీ గాలిదేవుడు, డ్రెయినేజి ఎస్ఈ మురళికృష్ణ, సర్వేశాఖ ఏడీ కనకరాజు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, తహసీల్దార్‌లు షేక్.సలీమా, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య తదితరులు

పెండింగ్ బిల్లులపై ఆరా.. ఆగ్రహం

1 చీరాల ఉప ఖజానా కార్యాలయంలో తనిఖీ
1 ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన జిల్లా అధికారి



కార్యాలయ సిబ్బందిని విచారిస్తున్న జిల్లా అధికారి చంద్రశేఖరరెడ్డి

చీరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చీరాల ఉప ఖజానా కార్యాలయంలో సిబ్బంది తీరుపై జిల్లా ఖజానా అధికారి ఎం చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఖజానాలో కాసుల గోల' కథనానికి స్పందించిన ఆయన కార్యాలయంలో తనిఖీ చేపట్టారు. పెన్షన్ రికార్డులు, కార్యాలయం అధికారి రమణారెడ్డి, సిబ్బంది లాగిన్లలో ఉన్న పెండింగ్ బిల్లులను పరిశీలించి ఆరా తీశారు. సిటిజన్ చార్ట్‌ను అనుసరించి నిర్దేశించిన వ్యవధిలో విధులు నిర్వహించాలని సూచించారు. బిల్లులకు సంబంధించిన రిపోర్టులను జిల్లా కార్యాలయానికి నివేదిక అందించాలన్నారు. ఉద్యోగులు, పించన్ దారుల పట్ల చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు.

వర్ష బీభత్సం

● జిల్లావ్యాప్తంగా ముంచెత్తిన వాన
● కుంభవృష్టితో జన జీవనం అస్తవ్యస్తం

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గంట... రెండు గంటలు కాదు. ఏకంగా ఐదారు గంటలకు పైగా జిల్లా అంతటా వర్షం కుంభవృష్టిగా కురిసింది. ఎడతెరిపి లేకుండా మంగళవారం రాత్రి 10 గంటలకు మొదలుకొని బుధవారం వేకువజాము వరకు వర్షం కురవడంతో దాని ప్రభావం జిల్లాపై తీవ్రంగానే చూపించింది. ఒక్క రాత్రిలోనే నెల అంతటా కలుపుకుని కురిసే వర్షం పడటంతో వరద పోటెత్తింది. ఎటు వీలుంటే అటు ఉధృతంగా ప్రవహించి లోతట్టు, నివాస ప్రాంతాలను నీట ముంచేసింది. అమరా వతిలో రికార్డు స్థాయిలో 165.5 మీమీ వర్షపాతం నమోదైం ది. పలు కాలనీలు, గ్రామాలలకు సంబంధాలను తెంచేసింది. లోలెవల్ చప్టాల వద్ద వరద రోడ్డు పైకి చేరి ప్రవహించడం తో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయా యి. మంగళవారం, బుధవారం కురిసిన వర్షం జిల్లాపై తీవ్ర ప్రభావాన్నే చూపించింది. పట్టణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తి చూపింది. పలు ప్రధాన మార్గాల్లోని రోడ్లపై నడుం లోతు పైగా వర్షం నీరు చేరి గంటల తరబడి నిలబడిపోయింది. దీంతో వాహనాల రాకపో కలకు ఆటంకం కలిగింది. గుంటూరు, నరసరావుపేట, బాప ట్లతో పాటు పలు పట్టణాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బుధవారం ఉద యం కార్యాలయాలకు వచ్చిన ఉద్యోగులు, సందర్శకులు లోనికి వెళ్లేందుకు కూడా వీలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

స్తంభించిన రాకపోకలు

గుంటూరు అమరావతి రోడ్డులో లాం వద్ద కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించి రోడ్డుపైకి చేరడంతో ఆ మార్గం లో వాహనాలను నిలిపేశారు. పోలీసులు, పంచాయతీ అధి కారులు ఇరువైపులా పహారా కాసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కారణంగా ఉద యం హైకోర్టు, సచివాలయానికి ఉద్యోగులు విధులకు హాజరు కాలేకపోయారు. పెద్దపరిమి వద్ద కొట్టేళ్ల వాగు ఉధృ తంగా ప్రవహించడంతో రాజ ధానికి రాకపోకలు నిలిచాయి. జాతీయ రహదారిపై కాజా టోల్‌ప్లాజా వద్ద వరదనీరు మూడు అడుగుల ఎత్తులో ప్రవహించ డంతో వాహనాల రాక పోకలకు ఆటంకం కలిగింది. పెద కాకానిలోని నంబూరు లో తాగునీటి చెరువు కట్ట తెగిపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. పాలడుగు వద్ద వాగు కూడా రహదారిపై ప్రవహిస్తున్నది. ప్రకాశం బ్యారేజీకి అంతకంతకూ పెరుగుతున్న వరద లంక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కరకట్టలు బలహీనంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.



కారంచేడు- ఆదిపూడి గ్రామాల మధ్య పొలాల్లో నిలిచిన వర్షపునీరు

రైళ్లకు కాషన్ ఆర్డర్

భారీ వర్షాలతో రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. గుంటూరు - తెనాలి మార్గంలో 14వ నంబరు వంతెన వద్ద వరదనీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు తగ్గించారు. అలానే పిడుగురాళ్ల - బెల్లంకొండ మధ్య 59వ నంబరు వంతెన వద్ద వరద ఉధృతంగా ఉండటంతో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు తగ్గించారు.

కృష్ణానదిలో పెరిగిన వరద

విజయపురిసౌత్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉరకలెత్తి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి పోటెత్తుతోన్న వరదతో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగా ర్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,28,141 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో బుధవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. జలాశయ నీటిమట్టం 588.90 అడుగులు ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,754, కుడి కాల్వ ద్వారా 4050, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, 4 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,34,850 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 2,69,445 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్: ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి బుధవారం సాయంత్రం 6 గంటలకు 3 లక్షల 63 వేల 438 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. కాగా రాత్రి 7 గంటలకు 3 లక్షల 97 వేల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజిని తాకడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3 లక్షల 97 వేల 250 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజికి వరద ఉధృతి పెరుగుతుండడంతో దిగువ ప్రాంతాల వారు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించారు.

ఉధృతంగా కొమ్మమూరు కాలువ

కారంచేడు(పర్చూరు) : రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలతో కారంచేడు కొమ్మమూరు కాలువకు భారీగా నీరు చేరింది. దీంతో కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే కారంచేడు వద్ద నీటిమట్టం దాదాపు ఏడున్నర అడుగులకు చేరింది. అయితే కొన్నేళ్ల నుంచి కొమ్మమూరు కాలువకు మర మ్మతులు చేయించకపోవడంతో కట్టలు బలహీన పడి మరమ్మ తులకు గురయ్యాయి. దీంతో కాలువ పరివాహ ప్రాంతాలైన కుంకలమర్రు, స్వర్ణ, కారంచేడు తదితర ప్రాంతాల లోతట్టు భూములు నీటమునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లగా కాలువకు ఆరుఅడుగులకు మించి నీటి సరఫరా జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం నీటి పరిమాణం భారీగా పెరుగుతుండటంతో లోతట్టు గ్రామ ప్రజ లు ఆందోళన చెందుతున్నారు.

నీటి మునిగిన మాగాణి ...

భారీవర్షాలతో కాలువలు పొంగి పొరలుతుండడంతో కారం చేడు, స్వర్ణ, కుంకలమర్రు తదితర ప్రాంతాల్లోని వరివిత్తనాలు వెదజల్లిన మాగాణి, భూములు నీట మునిగాయి. ఆయా గ్రామాల్లోని పంట పొలాలు వాగులను తలపించే విధంగా ఉన్నాయి. దీంతో వరి విత్తనాలను వెదజల్లిన రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు ప్రారంభంలోనే ప్రకృతి విపత్తుతో నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.



కొమ్మమూరు కాలువలో భారీగా చేరిన వర్షపునీరు

జిల్లాలో.. హై అలర్ట్

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ వెంకటమురళి ప్రకటించారు. కలెక్టరేట్ కంట్రోల్‌రూ మ్ ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నెంబరు 1077తో పాటు 08643-220226 కేటాయించారు. రేపల్లె ఆర్డీవో 8648293795, కొల్లూరు 7794894544, భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయలో 8331913995, 8712655931 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలు కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. పంట కాల్వలతో పాటు డ్రెయినేజీలు పొంగి పొలాలను ముంచెత్తడంతో అన్నదాత గుండె చెరువైంది. చీరాలలోని శాంతినగర్ సమీపంలోని ప్రధాన రహదారి చెరువును తలపించేలా మారింది. తెనాలి-రేపల్లె, చీరాల నియోజకవర్గ పరిధిలోని ఈపూరుపాలెం ప్రధాన రహదార్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కారంచేడు పరిధిలోని కొమ్మమూరు కాల్వ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడు అడుగులకు పైగా ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాల ధాటికి కొల్లూరు మండల పరిధిలోని లోతట్టు గ్రామాల్లోని ఇళ్లను ఇప్పటికే వరద నీరు తాకింది. బుధవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజీ నుంచి 3.44 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో కొల్లూరు మండలంలోని లంక గ్రామాలకు మళ్లీ వరద పొటెత్తే అవకాశాలు ఉన్నాయని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లంక గ్రామాల ప్రజలను ముంపు భయం వెంటాడుతోంది. ఇప్పటికే అరవింద వారధి వద్ద నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

కృష్ణానది వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పర్యావరణ విపత్తుల నిర్వాహణపై మంత్రి వంగలపూడి అనిత, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి నిర్వహించిన వీక్షణ సమావేశంలో జిల్లాలోని పరిస్థితిపై కలెక్టర్ వివరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. 50 వేల ఎకరాలు నీటమునిగియన్నారు. బుధవారం రాత్రికి 4లక్షల క్యూసెక్కుల వరదనీరు కృష్ణా నది నుంచి సముద్రంలోకి చేరుతుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో 8 సెం.మీ సగటు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షం ధాటికి 8 సెం.మీ సగటు నమోదైనట్లు సీపీవో కార్యాలయం తెలిపింది. అత్యధికంగా చుండూరు మండలంలో 27, కారంచేడు 15, కొల్లూరు 14, కర్లపాలెం 11, వేమూరు 11 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది.అమృతలూరు 10, బాపట్ల 10, చీరాల 12, వేటపాలెం మండలాల్లో 9 సెం.మీ. వర్షం కురిసింది.

ఎమ్మెల్యే దామచర్లను కలిసిన ఒడా చైర్మన్



రియాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, రవిశంకర్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు చైర్మన్ పదవి రావడం కోసం చేసిన కృషికి దామచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే దామచర్ల ఈ సందర్భంగా రియాజ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత కంది రవిశంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతిగృహంలో విచారణ



డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం డిప్యూటీ కలెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ సంక్షేమశాఖ అధికారి పార్థసారధి విచారణ జరిపారు. ఇటీవల హాస్టల్‌లో బాలిక జుట్టు కత్తిరించిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాటసమితి అధ్యక్షుడు సుజన్‌మాదిగ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు విచారణాధికారిని కలిసిన సంఘటనా బాధ్యులు, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. తన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చప్పిడి వెంగళరావు, జె.అంజనేయులు, పేరం శ్రీనివాసరావు, చింతలపాలెం యలమందబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్స్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెన్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అందరూ సమష్టిగా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత ఆర్థికరంగంలో ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ పాత్ర ప్రాముఖ్యమైనదని చెప్పారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా దివి రోశయ్య, కార్యదర్శిగా సీహెచ్‌ఏబీఎస్.నారాయణ, కోశాధికారిగా కేవీ.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా భార్గవప్రతాప్, వీఎస్.రాఘవేంద్రకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.మణికంఠ, సభ్యులుగా ఎ.రమేష్‌రెడ్డి, ఆర్.తేజసూర్యకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీని ఎమ్మెల్యే దామచర్ల అభినందించారు. కార్యక్రమంలో ట్యాక్స్ విభాగం జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్, డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'ను ఆచరించండి : సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత ప్రతిఒక్కరూ 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని ఆచరించాలని వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తుపదార్థాల ప్రభావంతో అధ్వానంగా మారుతున్న సమాజ స్థితిగతులను గురించి వివరించారు. అలాగే మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితం ఛిన్నాభిన్నమవుతుందన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





ఇందిరమ్మకాలనీ 2, 4వ లైన్‌లోని గుంతల్లో నిలిచిన వర్షపునీరు



కేశవరాజుకుంటలోని చిన్నమల్లేశ్వరకాలనీ జలమయం

చినుకుపడితే చిత్తడే..!

● భారీ వర్షానికి తడిసి ముద్దయిన నగరం
● పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తం

ఒంగోలులో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది. దాంతోపాటు పలు కాలనీల్లో రోడ్లు అస్త్యవస్తంగా మారడంతో ప్రజలకు పాట్లు తప్పలేదు. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారాయి. నగరంలోని ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు లోతట్టు ప్రాంతాల్లో చెరువులను తలపించాయి. రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షంతో పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొప్పోలురోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీ స్టేడియంలో భారీగా వర్షపునీరు చేరింది. అలాగే శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్‌కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రంజాషువా కాలనీ, మదర్ థెరిస్సాకాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలురోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, రైల్వేస్టేషన్‌రోడ్, పలు ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)



ఇందిరమ్మకాలనీ 5వ లైన్‌లో..



కొప్పోలు రోడ్డులో..

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక లాయర్‌పేటలోని టంగుటూరి ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలను అర్పించి మనకు స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, అటువంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, డాక్టర్ కొమ్మి నర్సింగరావు, మాకినేని అమరసింహం, తిరంగా యాత్ర ఇన్‌చార్జి దామెదర్, బొద్దులూరి ఆంజనేయులు, పి.లక్ష్మణ్, రమాదేవి, దండు శ్రీనివాసులు, రావులపల్లి నాగేంద్రయాదవ్, పి.తిరుమల, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

● రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20 నుంచి 25వతేదీ వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ సీపీఐ వంద వసంతాలను పురస్కరించుకొని ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారన్నారు. అలాగే ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు ఒంగోలు కళా ఉత్సవాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా కళాకారులు పాల్గొంటారన్నారు. 23న భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటనలు కేవలం మీడియాకే పరిమితం అవుతున్నాయని ఆరోపించారు. ఒంగోలు డెయిరీ పాలకుల నిర్లక్ష్యం, అవినీతి వల్లే మూతపడిందన్నారు. ఆయా అంశాలపై రాష్ట్రమహాసభల్లో చర్చించి పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, నాయకులు ఆర్.వెంకట్రావు, శ్రీరామ్ శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, యుగంధర్, రాజేంద్ర, వలరాజు, నాగభూషణం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వరయ్య, నాయకులు

కొరమీను చేపల పెంపకంపై శిక్షణ

మార్టూరు,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి) మండల సమాఖ్య భవనంలో ఆక్వా వారితో సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ ద్వారా కొరమీను చేపల పెంపకంపై బుధవారం రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొరమీను చేపల పెంపకం దారులకు పలు సూచనలను చేశారు. వాటి పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, ఏపీఎంలు శ్రీనివాసరెడ్డి, సురేంద్రబాబు, పలు మండలాలకు చెందిన కొరమీను చేపల పెంపకం దారులు, వాటి పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు పాల్గొన్నారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత



కుట్టుమిషన్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం ఓ మహిళకు జీవనాధారంగా కుట్టు మిషన్‌ను అందజేశారు. రావినూతల ఎలిజిబెత్ అనే మహిళకు రోటరీ మాజీ అసిస్టెంగ్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన సౌజన్యంతో రూ.8 వేల విలువైన కుట్టుమిషన్‌ను అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివధర పూర్ణచందరరావు, అలహరి హరిప్రసాద్, శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి, శివయ్య, శ్యామ్‌బాబు, ఖాజావలి, దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కలశ పునఃప్రతిష్ఠ మహోత్సవం



కలశ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

అద్దంకిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనర సింహస్వామి ఆలయ కలశ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలల్లో దాతలు కోనేటి అనిల్‌కుమార్ దంపతులు, కోనేటి శేఖర్ దంపతులు పాల్గొని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సంతమాగులూరు ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) వర్షాకాలం రావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై పంచాయతీ అధికారులు దృష్టి సారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేశారు. ఇంటిముందు మురుగునీరు చెత్తచెదారం లాంటివి, పాడైన కొబ్బరి బోండాలలో నీళ్ల నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఇంటిముందు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మక్కినవారిపాలెం, ఏల్చూరు, కార్యదర్శులు నాగార్జున, పున్నారావు ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి బుధవారం సాయంత్రం గ్రామలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

● మంత్రుల కమిటీకీ వినతి అందించిన దేవరాజ్

చీరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి స్వతంత్ర్య సమరయోధులు, చీరాల - పేరాల ఉద్యమ కారులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని సాధన సమితి ప్రతినిధులు తాడివలస దేవరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం సచివాలయంలో జిల్లాల విభజన మంత్రుల కమిటీ సమావేశంలో దేవరాజ్ వినతిని అందించి అభ్యర్థించారు. చీరాల్లో అన్నివిధాలుగా సౌకర్యాలు ఉన్నట్లు వివరించారు. కొన్ని నియోజకవర్గాలతో పోలిస్తే చీరాల అభివృద్ధి చెందిన ప్రాంతంగా మంత్రులకు వివరించారు. డేవిడ్ ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థినుల మిస్సింగ్- ఛేదించిన పోలీసులు

వేటపాలెం (చీరాల), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇరువురు ఇంటర్ విద్యార్థినుల మిస్సింగ్ కేసును వేటపాలెం పోలీసులు ఛేదించారు. చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. చదువుపై ఇద్దరు విద్యార్థినులు ఆసక్తి లోపించడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో వారు సోమవారం ఇంటి నుండి అదృశ్యమయ్యారు. ఘటనపై తల్లిదండ్రులుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వారిని గుర్తించి బుధవారం తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. అంతేకాకుండా తల్లిదండ్రులకు, చిన్నారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.





వర్షపునీటిని బయటకు పంపేందుకు చీరాలలో పూడిక తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్, రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న చైర్మన్ సాంబశివరావు, బల్లికురవ ఎస్టీ కాలనీ ముందు నిలిచిన వర్షపునీరు

వాగులు కాదు.. రహదారులే..

- పలుచోట్ల భారీ వర్షం- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పైర్లకు వర్షం ఉపయోగమే

చీరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా నియోజకవర్గం పరిధిలోని ప్రధాన రహదారులు సైతం వంకలను తలపిస్తున్నాయి. డ్రయిన్‌లు పొంగి నివాసాల్లోకి మురుగు చేరుతుంది. చెట్లు, పుట్టలు సైతం జలమయమై వాగుల మాదిరిగా దర్శనిమిస్తున్నాయి. పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. చీరాల - బాపట్ల ప్రధాన రహదారిలో పలు చోట్ల పెద్దఎత్తున నీళ్లు నిలిచాయి. ఈక్రమంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో ప్రస్తుతం వేరుశనగ మాత్రమే సాగు ప్రారంభమైంది. అయితే ఇప్పటి వరకు కురిసిన వర్షంతో పెద్దగా సమస్యలు ఉండవని, ఇదే తరహా కొనసాగితే పంట నష్టం భారీగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీలో చైర్మన్ సాంబశివరావు ఆధ్వర్యంలో మురుగు కాలువలు పూడిక తీసే పనులు ప్రారంభించారు. అలాగే ఈపూరుపాలెం పరిధిలో సెక్రటరి మురళీ బాపూజీ సిబ్బంది సహాయంతో గ్రామంలో సుమారు 500 మీటర్లు మేర శుభ్రం చేయించి వర్షపు నీటిని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లోకి వదిలే ప్రయత్నం చేస్తున్నారు.

బల్లికురవ : రోడ్డు అంచులను కాలువను పూడ్చి నిర్మించిన అక్రమ నిర్మాణాలతో వర్షాలు కురిస్తే నీరు వెళ్లే మార్గం ఉండడం లేదు. దీంతో తరచూ పెద్ద ఎత్తున నీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. రహదారిపై నీరు నిలవడంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డులో ఎస్టీకాలనీ ముందు భాగంలో మురుగునీరు వెళ్లే కాలువను పూడ్చివేసి ఓ వ్యక్తి కొన్ని గదులను నిర్మించాడు. దీంతో రోడ్డు పక్కన వెళ్లాల్సిన నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో అర్‌అండ్‌బీ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, రోడ్డుపై వాగుమాదిరిగా నీరు ఉంటుందని వారు వాపోతున్నారు. కాలువను పూడ్చి గదుల నిర్మాణం చేపట్టినా, అధికారులు ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. పెద్దపాటి వర్షం కురిస్తే రోడ్డు కూడా కనిపించకుండా నీరు నిలుస్తోందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అంచులలో కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

మేదరమెట్ల : భారీవర్షాలతో ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు పొలాలకు గండ్లు పడడంతో పాటు కొన్నిచోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. దైవాలరావూరులోని ప్రాథమిక పాఠశాలలో నీరు నిలిచి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. పాఠశాల ఆవరణ అంత నీరు నిలవడంతో నీటిలో తరగతి గదులకు వెళ్ళాల్సి వచ్చింది. మండలంలోని పలు పాఠశాలల్లో నీరు నిలిచినప్పటికీ, విద్యార్థులకు ఇబ్బందికరంగా లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలలో నీరు నిలువకుండా చూడాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మొక్కజొన్నలో నీరు నిల్వలేకుండా చూడండి

అద్దంకిటౌన్ : మొక్కజొన్న సాగు చేసిన రైతులు పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏవో కొ్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగుచేస్తున్న పంటలను అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీవర్షాలు కురుస్తున్నందున 30 రోజుల లోపు ఉన్న మొక్కజొన్న పొలాల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే బయటకు పంపాలన్నారు. తేమ అధికంగా ఉన్న చోట ఎకరాకు 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ పవన్‌సాయి, ఆత్మ బీటీఎం కోటేశ్వరరావు, రైతులు రాధాకృష్ణమూర్తి, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం మండలంలోని పలు గ్రామాలలో 1250 ఎకరాలలో మినుము, 150 ఎకరాలలో మొక్కజొన్న, 50 ఎకరాలలో పత్తి, వందల ఎకరాలలో పశువుల మేతకోసం మేతజొన్న సాగు చేపట్టినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మినుము ఇతర పంటల సాగు చేపట్టిన నెలరోజుల వ్యవధిలో కనీస వర్షంలేక పైరు ఎండుమొఖం పట్టిన పరిస్థితి నెలకొంది. మంగళ, బుధవారాల్లో కురుస్తున్న వర్షం పైరుకు బఊపిరిపోసింది. మంగళవారం 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.




రోడ్డు అంచు మూసివేయడంతో బల్లికురవలో నిలిచిన వర్షపునీరు, జీవం పోసుకున్న మినుము

ఏబీసీ డైవర్షన్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం



జారుడు బల్లలాగా మారిన ఏబీసీ వంతెన డైవర్షన్ రోడ్డు

బల్లికురవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డులో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. డైవర్షన్ రోడ్డు సక్రమంగా వేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా, బురద మట్టితో రోడ్డు జారుడు బల్లలాగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలతో ఏబీసీ వంతెన వద్ద ఉన్న రోడ్డుపై వాహనాలు వెళ్లేందుకు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. బస్సులు సైతం ఈ మార్గంలో వెళ్లే వీలు లేక కొమ్మినేనివారిపాలెం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఎర్రమట్టిని డైవర్షన్ రోడ్డుపై తోలితే చిన్నపాటి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండదని ప్రజలు వాపోతున్నారు. వంతెన పనులు శరవేగంగా పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

అనారోగ్య బాధితులకు సాయం

మార్టూరు,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం చేశారు. రూ.10 వేల నగదు, 25 కిలోల బియ్యం బస్తాను అందచేశారు. వారు విజయనగర్ కాలనీలో నివసిస్తున్న దివ్యాంగుడు అంబటి నాగేశ్వరరావుకు, చిమ్మిరిబండ గ్రామంలోని దుడ్డు అంజయ్య, దుడ్డు పెద్దమ్మాయికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, షేక్ బాషా, జాష్టి సాంబశివరావు, పుట్టా అయ్యప్పస్వామి, తాళ్లూరి మార్తా శ్రీను, షేక్ అలా భక్షు, షేక్ హబీబా తదితరులు పాల్గొన్నారు.

16న షటిల్ టోర్నమెంట్

పర్చూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) పర్చూరులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో ఈ నెల 16న ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో మెన్స్ డబుల్ షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తంగెళ్ల మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.10,000, రెండవ బహుమతి రూ.8,000, మూడవ బహుమతి రూ.6,000, నాల్గవ బహుమతి రూ.4000ల చొప్పున అందిస్తామన్నారు. వివరాలకు 9032972973, 9573727550 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఏటీఎంలో ఘరానా మోసం

- బ్యాంకు ఖాతా నుంచి రూ.40 వేలు అపహరణ
- వన్‌టౌన్‌లో కేసు నమోదు

చీరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంలో నగదు డ్రా చేసుకుంటున్న వ్యక్తికి మరొక వ్యక్తి మాయమాటలు చెప్పి బ్యాంకు ఖాతా నుంచి నగదు అపహరించాడు. దీంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలేనికి చెందిన వాయల రాంబాబు బుధవారం మధ్యాహ్నం చీరాల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లగా, అప్పటికే గుర్తు తెలియని వ్యక్తి అక్కడ ఉన్నాడు. అయితే రాంబాబు యధావిధిగా డబ్బులు డ్రా చేసుకునే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి జోక్యం చేసుకొని మాయమాటలతో మభ్యపెట్టాడు. డబ్బులు డ్రా చేసేందుఉ సాయం చేస్తానంటూ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న నకిలీ ఏటీఎంను రాంబాబుకు మార్చేశాడు. అయితే ఎన్నిసార్లు డ్రా చేసినా డబ్బులు డ్రా కాలేదు. దీంతో రాంబాబు విషయం తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా అప్పటికే అతని ఖాతా నుంచి నగదు డ్రా చేసినట్లు తెలిపారు. పైగా ఆయన వద్ద ఉన్న కార్డు ఆయనదు కాదని చెప్పడంతో అసలు విషయం గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో సీఐ సుబ్బారావు కేసు నమోదు చేసి సీసీ కెమెరా ఆధారంగా నేరస్థుడిని గుర్తించే పనిలో పడ్డారు.

మినీస్టేడియం నిర్మాణానికి సన్నాహాలు

- స్థల పరిశీలన చేసిన స్పోర్ట్స్ అథారిటీ అధికారులు
- కళాశాల మైదానంలో అన్ని వసతులు ఉండేలా ప్రణాళిక

బల్లికురవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం బల్లికురవలో ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడేలా మీని స్టేడియం నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి సమకూర్చేందుకు ముందుకు రావడంతో అధికారులు స్పందించారు. బుధవారం బాపట్ల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ కే.పాల్‌కుమార్, విజయవాడ డీఈ ఆనీల్‌లు జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. సుమారు రూ.4 కోట్ల నిధులు ఈ స్టేడియం నిర్మాణానికి అవసరమని ప్రాథమిక అంచనా వేశామన్నారు. కళాశాల 11 ఎకరాలకు చూట్టుతా ప్రహరీ గోడ, లోపల మీని స్టేడియం, వాకింగ్ ట్రాక్, పలు క్రీడలకు సంబంధించిన కోర్టులు, ప్రత్యేక జిమ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల స్థలానికి అన్ని వైపులా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయించాలని తహసీల్దార్ రవినాయక్‌ను కోరారు. రెండు రోజుల్లో సర్వే చేయిస్తామని అయన తెలిపారు. ఈ పరిశీలనలో మంత్రి వ్యక్తిగత సహాయకులు బాలాజీ, మండల సర్వేయర్ సత్యనారాయణ, క్రీడా విభాగం ఏఈలు రాంబాబు, నితిన్, సొసైటీ చైర్మన్ గొట్టిపాటి లక్ష్మయ్య, టీడీపీ గ్రామ నేతలు నాగబోయిన సింగారావు, పావులూరి ఏడుకొండలు, సర్పంచ్ పందిరి అంజిబాబు, ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అధికారులు



వల్లాపల్లి ఎస్టీ కాలనీలో పారిశుధ్యం పడక

- వ్యర్థాలతో పూడిపోయిన కాలువలు
- పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు

బల్లికురవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపల్లి ఎస్టీకాలనీలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో ఉన్న మురికి కాలువలు పూడిపోవడంతో స్థానికుల మధ్య నిత్యం చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అదికారులు మాత్రం కాలువలో వ్యర్థాలను తీసేందుకు ముందుకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. గత నెలలో గ్రామంలో కొంతమేర పారిశుధ్య పనులు చేపట్టినా, చేయించిన ఎస్టీ కాలనీలో మాత్రం సక్రమంగా చేపట్టలేదని వారు వాపోతున్నారు. రోడ్డుపైనే మురుగు పారుతోందని కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోయాయని గడ్డి పెరిగిందని రోజు దోమల బెడదతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. అధికారులు వెంటనే గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి ఎస్టీ కాలనీలో మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




ఎస్టీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మరుగునీరు, పూడుకు పోయిన కాలువ

వాహనాల్లో డీజిల్ చోరీ ముఠా అరెస్టు

అద్దంకిటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సులో డిజిల్ దొంగతనం చేసిన దొంగలను అద్దంకి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సుబ్బరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 10న రామ్‌నగర్ పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న బస్సులో నుంచి డీజిల్ చోరీ జరిగింది. బస్సు యజమాని మెరువ శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. ఈ కేసులో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామం, సీతారామపురం తండాకు చెందిన బాణావత్ బాలబాదు నాయక్, బాణావత్ తులసిబాబునాయక్, మోరజోతు శ్రీనునాయక్, గంగులపల్లి తండాకు చెందిన రామవత్ దుర్గప్రసాద్ నాయక్‌లను చోరి చేసినట్లు గుర్తించారు. వీరిని శింగరకొండ సమీపంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 150 లీటర్లు డిజిల్, ఒక ఇన్నోవా కారు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో సంతమాగులూరు, కారంపూడి, బండ్లమెటు, బట్టిప్రోలు, పోలీస్‌స్టేషన్ల పరిధిలో డిజిల్ దొంగతనం కేసులు నమోదయ్యాయని సీఐ సుబ్బారావు తెలిపారు.



డీజిల్ దొంగతనం చేసిన నిందితులతో పోలీసులు

అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్


- మంత్రి వర్గం ఉపసంఘానికి ప్రతిపాదనలు

అద్దంకి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందినట్లు మంత్రివర్గ ఉపసంఘం వెల్లడించింది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, చేర్పులు మార్పులపై బుధవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సందర్భంగా వచ్చిన అర్జీల వివరాలను మంతి వర్గ ఉపసంఘం వెల్లడించింది. అందులో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. గతంలోనే మంత్రి రవికుమార్ పలుమార్లు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపొయారు. ఈ నేపథ్యంలోనే మంత్రి వర్గ ఉపసంఘం కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఇంటర్ లాకింగ్ పనులు.. తాత్కాలికంగా పలు రైళ్ల రద్దు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గూడూరు సెక్షన్ల మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి - అదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ (17405-17406), తిరుపతి - విశాఖ ఏసీ డబుల్ డక్కర్ (22707 - 22708), గూడూరు-విజయవాడ ఇంటర్ సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12743- 12744) రైళ్ళను రద్దు చేశారు. అలాగే విజయవాడ - బిట్రగుంట ప్యాసింజర్ (67259-67260), విజయవాడ - గూడూరు ప్యాసింజర్ రైళ్లను (67225 - 67226) 13 నంచి 18వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

- గుర్తింపు కార్డు చూపిస్తే చాలు ప్రయాణానికి అనుమతి
- బస్సులకు పూర్తయిన రంగులు, మరమ్మ తులు



శ్రీ బస్సు రెడీ

రేపటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం

'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. మొత్తం ఐదు రకాల బస్సుల్లో నారీమణులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇందుకుగాను రేషన్ కార్డు/ఓటర్ ఐడీ/ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి కండక్టర్‌కు చూపిస్తే చాలు. ఆయన 'జీరో' టికెట్ ఇస్తారు. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

- నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధమవుతోంది. చేతిలో గుర్తింపు కార్డు ఉంటే చాలు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు ఆర్టీసీ జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. బస్సుల కండీషన్, బస్సులకు రంగులు, డ్రైవర్ల కొరత లేకుండా కాల్‌ఆన్ డ్రైవర్ల నియామకం, జీరో టికెట్‌పై సిబ్బందికి శిక్షణ, మహిళలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. శుక్రవారం నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ఆవరణలో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు ఉచిత ప్రయాణంను ప్రారంభించనున్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఆయా బస్టాండ్లలో ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ఉచిత బస్సు ప్రయాణాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించనున్నారు.

● సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై జిల్లావ్యాప్తంగా డ్రైవర్లు, కండక్టర్లు, విచారణ కేంద్రంలో ఉండే సిబ్బందికి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని డ్రైవర్లు, కండక్టర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని అధికారులు సూచించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గ్యారేజ్ గేట్ల వద్ద సిబ్బందికి సూచనలు ఇవ్వడంతోపాటు జోనల్ కళాశాలలో ప్రత్యేక ట్రైనింగ్ అందించారు.

● కాల్ ఆన్ డ్రైవర్ల నియామకం

ఉచిత ప్రయాణంతో బస్సుల్లో ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తారని భావించిన అధికారులు డ్రైవర్ల కొరత లేకుండా 130 మంది కాల్‌ఆన్ డ్రైవర్లను జిల్లావ్యాప్తంగా తీసుకున్నారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి బస్సులను వారి చేతికి అప్పగిస్తున్నారు. రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో బస్సుల సంఖ్యను బట్టి కాల్‌ఆన్ డ్రైవర్లను తీసుకున్నారు.



సిబ్బందికి సూచనలు అందిస్తున్న షమీమ్

ఘన స్వాగతం పలకండి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణానికి ఘన స్వాగతం పలకాలని జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. నగరంలోని ఆర్టీసీ ఒకటవ డిపో గ్యారేజ్ గేటు వద్ద బుధవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులతో గేట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న షమీమ్ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం ప్రారంభమయ్యాక సర్వీసు కండక్టర్, డ్రైవరు ప్రయాణికులతో సానుకూలంగా స్పందించాలని, ఎటువంటి ఫిర్యాదు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ పరిధిలో బస్సుల సంఖ్య : 642

సొంత బస్సులు : 510

అద్దె బస్సులు : 132

డిపోలు : 7

ఏ డిపోలో ఎన్ని బస్సులు : ఆత్మకూరు 71, కందుకూరు 102, కావలి 98, రాపూరు 50, ఉదయగిరి 73, నెల్లూరు-1 127, నెల్లూరు-2 121,

ప్రయాణికుల సంఖ్య (రోజుకు) : 1.5 లక్షలు

రోజుకు బస్సులు తిరిగే కి.మీ : 2,35,861

రాబడి (రోజుకు) : రూ.95లక్షలు

ప్రస్తుతం మహిళలు ప్రయాణిస్తున్న శాతం : 40

ఉచితం అమలైతే పెరిగే అంచనా : 80



ఉలవపాడు : కాపు మీదున్న పునాస చెట్లు

కూల్.. కూల్!

● జిల్లాలో చల్లబడ్డ వాతావరణం ● రోజంతా చిరుజల్లులు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. మొన్నటిదాకా భానుడి భగభగలతో అల్లాడిన ప్రజానీకం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకుంది. కాగా, బుధవారం నెల్లూరుతోపాటు ముత్తుకూరు, రాపూరు, కందుకూరు తదితర ప్రాంతాలలో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలో సగటు వర్షపాతం 2 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 12.4, అత్యల్పంగా రాపూరులో 0.4 మి.మీ వర్షం కురిసింది. గురు, శుక్రవారాలలోనూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.



● ఉద్యాన పంటలకు మేలు

ఉలవపాడు : వాతావరణం చల్లబడటంతోపాటు రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో ఉద్యాన పంటలకు మేలు జరిగినట్లు అయ్యింది. వేసవిని తలపిస్తూ ఎండలు మండిపోవడంతో ప్రజలతో పాటు ఉద్యాన పంటలు తట్టుకోలేకపోయాయి. మామిడి, సపోటా చెట్లు ఎండ దెబ్బకు వాడుముఖం పడతున్నాయని మోటారు బోర్లతో రైతులు నీళ్ల కట్టుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే, రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో భూమి చల్లబడింది. భూమిలో కొద్దిపాటి తేమ చేకూరడంతో మామిడి, సపోటా చెట్లకు ఊతం ఇచ్చినట్లు అయింది. ప్రస్తుతం మండలంలో 2వేల ఎకరాలలో పునాస పూత, పిందె, అక్కడక్కడ కాయ దశలో ఉంది. గత జూన్ ఆఖరితో మామిడి సాగు పూర్తికావడంతో ఇప్పుడు పునాస కాపు అందుబాటులోకి వచ్చింది. తేలికపాటి వర్షంతో భూమిలో తేమ పునాస చెట్లకు, కాపునకు మేలు చేసినట్లు అయిందని రైతులు అంటున్నారు. అదేవిధంగా మన్నేరు కాలువ పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న జామ తోటలకు కూడా మేలు చేసినట్లు అయింది. అలాగే, సరుగుడు, జామాయిల్ సాగుకూ నీరు కట్టే బాధ తప్పినట్లు అయింది.

ఆ రెండూ ఇక అంతేనా!?

ఇన్‌చార్జుల పాలనలో నెల్లూరు, కావలి ఇరిగేషన్ డివిజన్లు

● ఈఈల నియామకంలో రాజకీయ అడ్డంకులు

నెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతి పెద్ద ఇరిగేషన్ డివిజన్ అయిన నెల్లూరు సెంట్రల్ డివిజన్, కావలి డివిజన్లు ఇన్‌చార్జ్‌ల పాలనలో కునారిల్లుతున్నాయి. పెన్నా డెల్టా మొత్తం ఈ రెండు డివిజన్ల పరిధిలోనే ఉండగా, వీటికి రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లేరు. మూడు లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ డివిజన్లకు రెగ్యులర్ అధికారులను నియమించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఈ ప్రభావం అంతిమంగా రైతాంగంపై పడుతోంది. ఇటీవల బదిలీల్లో ఈ రెండు డివిజన్లకు రెగ్యులర్ ఈఈలను నియమించేందుకు ప్రయత్నాలు జరిగినా రాజకీయ కారణాలతో అవి కార్యరూపం దాల్చలేదు. డివిజన్ పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు చాలా కీలకమైనది. క్షేత్రస్థాయి సమస్యలన్నీ ఈయన ఆధ్వర్యంలోనే పరిష్కరించాల్సి ఉంటుంది. నెల్లూరు సెంట్రల్ డివిజన్ ప్రధానమైనది. నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాలు పూర్తిగా ఈ డివిజన్ పరిధిలో ఉంటాయి. ఈ డివిజన్‌కు ప్రభుత్వం ఎప్పుడూ రెగ్యులర్ ఈఈనే నియమిస్తూ ఉంటుంది. ఈ ఏడాది మే వరకూ ఈఈగా నాగరాజు కొనసాగారు. ఆయన పదవీ విరమణ చేశాక ఆ స్థానంలో మరొకరిని నియమించలేదు. ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు పోస్టులను చూసుకోవడం కష్టంగా మారింది. అలానే కావలి ఈఈగా ఉన్న కృష్ణమోహన్ గతేడాది అక్టోబరులో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలను కావలి డీఈఈ ఖాన్‌కు అప్పగించారు. ఈ రెండు డివిజన్లకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కొందరు ఈఈలు ప్రయత్నాలు చేశారు. అప్పటికే పలువురు డీఈఈలకు ఈఈలుగా ఉద్యోగోన్నతి లభించడంతో సెంట్రల్ డివిజన్, కావలి డివిజన్లకు రెగ్యులర్ ఈఈలను నియమించడం ఖాయంగా ఇరిగేషన్ ఉద్యోగులు భావించారు. ఈ క్రమంలోనే కొందరు ఈఈలు స్థానిక ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు కూడా తీసుకున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు ఓ అధికారిని, మరికొందరు ఇంకో అధికారిని కోరుకోవడంతో రెగ్యులర్ అధికారుల నియామకం కొలిక్కి రాలేదు. రెగ్యులర్ ఈఈలు లేకుండానే రెండో పంట సాగు పూర్తయింది. ఈ సమయంలో సాగునీటి పంపిణీలో అనేక సమస్యలు తలెత్తాయి. సరైన పర్యవేక్షణ లేని కారణంగా కొన్ని కాలువలకు ఎక్కువగా నీరు వదిలేయగా, మరికొన్నింటికి తగ్గించారు. రైతులు గోల చేయడంతో అది ఎమ్మెల్యేలకు కూడా ఇబ్బందిగా మారింది. అక్టోబరు నుంచి కీలకమైన రబీ సాగు మొదలవుతుంది. ఈ సమయంలో ఓఅండ్ఎం పనులు చేపట్టాల్సి ఉంది. మరి ఆలోపు రెగ్యులర్ ఈఈలను నియమిస్తారో లేదో చూడాలి.



ఆశా కార్యకర్తకు మిఠాయి తినిపిస్తున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

- పూర్తివేతనంతో 6నెలల ప్రసూతి సెలవులు
- ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- రిటైర్డు అయ్యాక నెలకు రూ.5వేల గ్రాట్యూటీ
- జిల్లాలో 1,885 మంది ఆశాలకు మేలు

ఆశాలకు వరాల జల్లు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంతో పాటు పలు రకాల రాయితీలు కల్పిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగినుల తరహాలో 6 నెలలు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేశారు. అయితే, ఈ కాన్పుల సెలవులు రెండు ప్రసవాల వరకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచటంతో ప్రభుత్వం నిర్ణయంపై ఆశాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఉత్తర్వులు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ ఏప్రిల్ నుంచే ఉత్తర్వులు అమలవుతాయని ప్రభుత్వం ప్రకటిస్తే ఈలోగా ఉద్యోగ విరమణ చేసిన వారు తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంటుంది.

● గ్రాట్యూటీ రూపంలో నెలకు రూ.5వేలు

జిల్లాలో 1,885 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారు. వీరంతా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మాతాశిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను ప్రోత్సహించటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలతోపాటు పలు కీలక పనులు క్షేత్రస్థాయిలో చేపడుతుంటారు. వీరికి నెలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7200, కేంద్ర ప్రభుత్వం రూ.2,800 చొప్పున వేతనాల రూపంలో అందుతోంది. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తల ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భరోసా కల్పించేందుకు గౌరవ వేతనంలో సగం మొత్తాన్ని అంటే కొత్తగా గ్రాట్యూటీని నెలకు రూ.5 వేలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించింది. గరిష్ఠంగా 1.50 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గ్రాట్యూటీ చెల్లింపునకు కనీస సర్వీసు కాలాన్ని ప్రామాణికంగా తీసుకుంటారా!? అందరికి సమానంగా వర్తింప చేస్తారా అనేది స్పష్టత ఇవ్వాలి ఉంది. కాష్త్ర రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై బుధవారం ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ సంబరాలు చేసుకుంది. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆశాలకు స్వీట్లు పంచిపెట్టారు.

ఆశాలకు గుర్తింపు



ఆశాల సమస్యలు పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. గత మార్చి 6వ తేదీన చలో విజయవాడ వంటి కార్యక్రమాలూ చేపట్టాము. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించటం శుభపరిణామం. ఆశా కార్యకర్తల భవితవ్యం ఎంతో మెరుగుపడుతుంది. తద్వారా ఆశాల శ్రమకు తగిన గుర్తింపు కూడా వస్తుంది. అలాగే ఆశాల వేతనాలు కూడా పెంచాల్సి ఉంది.


- దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రసూతి సెలవులతోపాటు ఎన్నో రాయితీలు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆశాల కృషి ఎంతో ఉంది. అలాంటి మాకు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు కేటాయించటం ఎంతో ఆనందంగా ఉంది. ఉద్యోగులతో సమానంగా మాకు అవకాశం కల్పించారు. అలాగే ఆశాల ఉద్యోగ వయోపరిమితిని పెంచటం కూడా ఎంతో ఆనందంగా ఉంది.

- విజయలక్ష్మి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



'సోమశిల'కు 23,088 క్యూసెక్కుల వరద

అనంతసాగరం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. బుధవారం 23,088 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 41.954 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,850, వరద కాలువకు 7,200, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. పెన్నాపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కడప జిల్లా సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు ఇంజనీరు చెబుతున్నారు. గురువారం సాయంత్రంకు వచ్చే వరద 30 వేల క్యూసెక్కులు దాటవచ్చని అంచనా వేస్తున్నారు.



మనుబోలు దళితవాడలో అంగీకారపత్రాలు సేకరిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

దళిత, గిరిజనులకు సోలార్ కరెంట్

● అంగీకారపత్రాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

మనుబోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దళిత, గిరిజన కుటుంబాలకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్‌పవర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం విద్యుత్‌శాఖ సిబ్బంది మనుబోలులోని దళితవాడలో అంగీకార పత్రాలు సేకరించారు. దీనిపై ఏఈ అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఈ ఆదేశాల మేరకు దళిత, గిరిజనుల ఇళ్లపై సోలార్‌పలకలు అమర్చేందుకు అంగీకరిస్తున్నట్లు రాతపూర్వకంగా తీసుకుంటున్నామన్నారు. మండలంలో 1880 మంది దళితులు, 520 మంది గిరిజనులు ఈ పథకం కింద లబ్ధిపొందనున్నట్లు ఇది వరకే గుర్తించామన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం ఇందులో ఎంతమంది అర్హులవుతారో చూడాలన్నారు. పూర్తి వివరాల కోసం విద్యుత్ సిబ్బందిని లేదా విద్యుత్ కార్యాలయానికి వస్తే అవగాహన కల్పిస్తామన్నారు.

పట్టపగలే దారుణం

కత్తులతో విచక్షణ రహితంగా దాడి

నెల్లూరులో యువకుడి హత్య

స్నేహితుడే హంతకుడు!

వివరాలు 8 లో..



కేంద్ర ప్రభుత్వ పథకాలకు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయండి

- కార్యకర్తల్లో అసంతృప్తి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు నగరానికి చేరుకున్న మాధవ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత వేదాయపాలెం సెంటర్‌లో చాయ్ పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరితో మమేకం అయ్యారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద శ్రీ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత వీఆర్సీ కళాశాల నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు జరిగిన శోభయాత్రలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. కళాక్షేత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో

- మిగతా 7లో...

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520

దుకాణాల్లో తనిఖీ : ప్లాస్టిక్ కవర్ల సీజ్

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వాణిజ్య ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఆధ్వర్యంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు బుధవారం దుకాణాలలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు సీజ్‌చేసి జరిమానాలు విధించారు. పోస్టాఫీసు సెంటర్, కనిగిరి రోడ్డు, వెంకటనారాయణ బజారు, రైతు బజార్లలోని దుకాణాలతో పాటు తోపుడుబండ్లు, హోటళ్లు, చిరువ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వలన కలుగుతున్న దుష్పరిణామాలను వివరించి పర్యావరణహితమైన జూట్ కవర్లే వాడాలని ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



న్యూస్ బాక్స్

టీఆర్‌ఆర్‌లో 'నషా ముక్త్‌భారత్ అభియాన్'

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఈ పరిస్థితిలో మత్తుపదార్థాలకు దూరంగా ఉండి నవభారత నిర్మాణంలో భాగస్వాములై ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

18న చలో కరేడు

ఉలవపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ పరిశ్రమ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి చేపట్టిన బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 18వ తేదీన రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో చలో కరేడుకు పిలుపు ఇచ్చినట్లు సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. కావున చలో కరేడు కార్యక్రమాన్ని స్థానిక రైతులు, ప్రజాసంఘాల నేతలు, మద్దతుదారులు విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్ 30 యాక్ట్ రద్దు చేయాలి

కరేడు గ్రామంలో అమలులో ఉన్న పోలీస్ 30 యాక్ట్, భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్, అఖిలభారత రైతు కలీ సంఘం రాష్ట్ర నాయకుడు కే నాంచార్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని, గ్రామస్థులు, రైతులు ఇండోసోల్ పరిశ్రమకు మా భూములు ఇవ్వమని గ్రామ సభలో ప్రభుత్వ అధికారులకు స్పష్టంగా చెప్పినప్పటికీ పోలీస్ 30 యాక్ట్‌తో భయాందోళనకు గురిచేస్తు పొట్టేనుగుంట, రామకృష్ణాపురం ఎస్టీ కాలనీల్లో, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో పోలీసుల పర్యవేక్షణలో సర్వేలు నిర్వహించడం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

నేడు కూటమి పార్టీల ట్రాక్టర్ల ర్యాలీ

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులందరికీ తొలివిడత పెట్టుబడి సాయం విడుదలైన సందర్భంగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కందుకూరులో ట్రాక్టర్లతో రైతు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలతో పాటు రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

200 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 379 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 200 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-3, నోబిడ్-159, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 179 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.197.69 గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

బైక్ ఢీకొనడంతో వృద్ధురాలికి గాయాలు

అల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : బైకు ఢీకొని వృద్ధురాలికి గాయాలైన సంఘటన అల్లూరు చేపల మార్కెట్ ప్రాంతంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న వృద్ధురాలు తంగమ్మను ఢీకొని వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ఘటనలో తంగమ్మ కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ఆమెకు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి సీఎల్‌పురంలో అంధకారం

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురం కూడలిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధావారం సాయంత్రం పేలడంతో గ్రామంలో అంధకారం నెలకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎప్పుడు రద్దీగా ఉండే కూడలిలో ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో పేలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

వేధిస్తున్న యూరియా కొరత!

● విస్తారంగా జామాయిల్ తోటలు ● కందుకూరు సబ్ డివిజన్‌లో వేలాది ఎకరాల్లో పెంపకం ● రైతుల ఆందోళన



కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా సరఫరా లోటు ఉండటంతో పాటు ఈ సబ్ డివిజన్‌లో రైతుల అవసరాలను గుర్తించి ఇండెంట్లు పెట్టడంలో వ్యవసాయాధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పైర్లను రైతులు సాగు చేయలేకపోయారు. అయితే గత రెండేళ్లుగా ఈ ప్రాంతంలో వేలాది ఎకరాలలో దీర్ఘకాలిక పంట అయిన జామాయిల్ చెట్ల పెంపకం చేపట్టారు. ఈ ఏడాది సైతం మే నెలలో కురిసిన వర్షాల ఆధారంగా వందలాది ఎకరాల్లో జామాయిల్ మొక్కలు నాటారు. మొత్తంగా కందుకూరు సబ్ డివిజన్‌లో 70వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జామాయిల్ సాగులో ఉంది. ఈ చెట్లకు ఏడాదికి మూడుసార్లు ఎరువులు వేయాల్సి ఉంది. ఒక్కో విడత కనీసం బస్తా ఫాస్పేట్, బస్తా యూరియాను జామాయిల్‌కు రైతులు ఎదబెడతారు. అంటే ఏడాదిలో రమారమి 2 లక్షల బస్తాల ఫాస్పేట్, 2లక్షల బస్తాల యూరియా కేవలం జామాయిల్‌కు అవసరం కాగా ఈ సీజన్‌కు 70వేల బస్తాల ఫాస్పేట్, 70వేల బస్తాల యూరియా అవసరమవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే రైతుల అవసరాన్ని అంచనా వేయకుండా ఈ ప్రాంతంలో ఖరీఫ్‌లో పెద్దగా పంటల సాగు జరగలేదని అందుకనుగుణంగానే ఎరువుల ఇండెంట్లు పెట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎరువులు వేసేందుకు సిద్ధపడుతున్న రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఫాస్పేట్ ఎరువులను ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నా యూరియా దొరకని పరిస్థితి. కందుకూరు మండలంతో పాటు వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం మండలాల రైతులు కూడా యూరియా కోసం కందుకూరుకే పరుగులు తీస్తున్నారు. దీంతో పట్టణంలోని ప్రైవేటు వ్యాపారులు అసలు యూరియా స్టాకు లేదని సమాధానం చెబుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఎరువుల వ్యాపారులు బస్తా యూరియాకు రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. అది కూడా తమ దుకాణంలో రెగ్యులర్‌గా వచ్చే రైతులకు మాత్రమే సరఫరా చేస్తుండటంతో మిగిలిన రైతులు యూరియా కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఏడీఏ శేషారెడ్డి జామాయిల్‌కు యూరియా ఇవ్వలేమని, అది మా పైర్ల జాబితాలోకి రాదని ప్రకటించటం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ఏడీఏ స్థాయి అధికారి ప్రకటన చేయటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. కందుకూరు సబ్ డివిజన్‌లో ప్రస్తుతం అత్యధిక విస్తీర్ణంలో సాగై ఉన్న పైరు జామాయిల్ అని, మరే ఇతర పైరు కూడా ఇన్ని వేల ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం లేదని రైతులు విమర్శిస్తున్నారు. గత రెండేళ్లుగా గిట్టుబాటు ధర లభిస్తూ రైతుకు కొంత లాభసాటిగా కనిపిస్తున్నది కూడా జామాయిల్ మాత్రమేనని, దీనికి మూడుసార్లు ఎరువులు వేస్తే కర్ర దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. జామాయిల్‌ను ఈ క్రాఫ్ చేస్తున్న వ్యవసాయాధికారులు దానికి ఎరువులు ఇవ్వబోమని చెప్పటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కందుకూరు ప్రాంతంలో సాగులో ఉన్న జామాయిల్ తోటలు

● ఆర్‌ఎస్‌కేలలో ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేయటం గగనంగా మారుతున్న పరిస్థితుల్లో సహకార సంఘాలు, రైతు సేవాకేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)లలో ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సచివాలయానికి అనుబంధంగా ఆర్‌ఎస్‌కే ఉండటంతో పాటు ఎరువుల నిల్వకు తగిన గోదాములు కూడా ఉన్నందున ఎక్కడి రైతులు అక్కడే ఎంఆర్‌పీలకు ఎరువులు పొందేలా నిల్వలు పెట్టాలని కోరుతున్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద అదనపు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రవాణా ఛార్జీలు వ్యయప్రయాసలు మరింత భారంగా మారుతోందని వాపోతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇండెంట్లు తీసుకుని ఆర్‌ఎస్‌కేలలో ఎరువులు ఉంచేలా చూడటం ద్వారా ఎరువుల బ్లాక్ మార్కెట్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న యూరియా డిమాండ్‌కు అనుగుణంగా ఇండెంట్లు పెట్టి తెప్పించాలని కోరుతున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



గత కొన్నేళ్లుగా రైతుకు కొంత లాభసాటిగా కనిపిస్తున్నది జామాయిల్ మాత్రమే. ఈ పరిస్థితుల్లో వేలాది ఎకరాలలో సాగుచేసి ఉన్న జామాయిల్‌కు యూరియా లేదని చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జామాయిల్‌కు ఎరువులు వేసేందుకు సిద్ధపడుతుండగా యూరియా లేక అవస్థలు పడుతున్నాం. రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఇతర ఎరువుల నిల్వలు పెట్టేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలి.

- కంద్రా చినమాలకొండయ్య, రైతు, చుట్టుగుంట



రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, బోగోలు

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇంటర్వ్యూ

? మండలంలో భూముల రీ సర్వే ఎన్ని గ్రామాల్లో పూర్తయింది. మిగిలిన గ్రామాల్లో ఎప్పుడు చేస్తారు.

! మండలంలో 12 రెవెన్యూ గ్రామాలు ఉండగా 8 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. అల్లిమడుగు, బిట్రగుంట, జువ్వలదిన్నె, బోగోలు రెవెన్యూ గ్రామాల్లో చేయాల్సి ఉంది. ఈ గ్రామాల్లో డిసెంబరు నుంచి రీసర్వే ప్రారంభించి ప్రభుత్వం నిర్దేశించిన 2027 నాటికి పూర్తి చేస్తాం.

? రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో చాలా తక్కువ సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. అవి కూడా జాయింట్ ఎల్పీఎంలు, పేర్లు మార్పులు, భూమి కొలతలో కొద్దిపాటి తేడాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు రైతుల వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు, రికార్డులను పరిశీలించి సరిచేస్తున్నాం.

? చుక్కలు, సీజేఎఫ్ఎస్, ప్రభుత్వ భూముల్లో ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాల పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో చుక్కల భూములను పూర్తిగా పట్టా భూములుగా క్రమబద్ధీకరించాం. ఎంకా ఎక్కడైనా మిగిలి ఉంటే మీసేవ, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం. సీజేఎఫ్ఎస్, ప్రభుత్వ భూములను అర్హులకు అసైన్‌మెంట్ పట్టాలు మంజూరుకు జాబితాలు తయారు చేస్తాం.

? మండలంలో నీటిపన్ను బకాయిలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో 12,220 మంది రైతులు ఉండగా కొందరు మాత్రమే నీటిపన్ను చెల్లించారు. దాదాపు రూ.2,44,50,257 బకాయిలు ఉన్నాయి. బకాయిల వసూళ్ల బాధ్యత వీఆర్వోలకు అప్పగించాం. ఇటీవలనే ప్రభుత్వం నీటి పన్ను బకాయిలపై విధించిన 6 శాతం వడ్డీని రద్దు చేసింది.

పేదరికం లేని సమాజమే పీ-4 లక్ష్యం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, పక్కన ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని నిర్మించటమే పీ-4 లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగులో ఉన్న కుటుంబాలను ఆదుకోవటం కోసం ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించారన్నారు. కావలి నియోజకవర్గంలో 9,000 పేద కుటుంబాలను గుర్తించారని, ప్రతి ఒక్కరూ పేద వర్గాలను ఆదుకునేందుకు వారికి మార్గదర్శకులుగా వ్యవహరించాలన్నారు. ఇప్పటి వరకు 1350 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. దేవుడి కన్నా మానవసేవ గొప్పదని, సమాజంలో సేవ చేసే వ్యక్తులకు గౌరవం లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, ప్రయివేట్ సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తే సమాజంలో పేదవారికి ఆదరణ లభిస్తోందన్నారు.

ముసునూరులో తీరనున్న తాగునీటి సమస్య

● రూ.10 లక్షల మంజూరు ● పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



పైపులైన్ డిజైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ తదితరులు

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ముసునూరు 14, 15 వార్డులలో ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. దీనికి సంబంధించి మున్సిపల్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 10 లక్షలు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. త్వరలో పనులు చేపట్టనున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ బుధవారం మున్సిపల్ డీఈ సాయిరాంతో కలిసి ఆ ప్రాంతంలో పరిశీలించారు. మాగుంట పార్వతమ్మ లేఅవుట్ దగ్గర ఉన్న పెద్ద మంచినీటి బావిని, ముసునూరులో ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంకు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పైపులైన్ డిజైన్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ట్రంకు రోడ్డు విస్తరణలో భాగంగా ముసునూరులో నిర్మించిన డ్రైనేజీల కారణంగా మంచినీటి పైపులైన్ దెబ్బతినిందన్నారు. త్వరలో వాటి నిర్మాణాలు పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే ముసునూరులో మరో ఓవర్‌మెడ్ ట్యాంకు కూడా నిర్మించి ఉందని, దానికి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి ఆ ట్యాంకు కూడా నీరిచ్చి తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వినోద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

గుడ్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గుడ్లూరుకు చెందిన దామా వెంకటేశ్వర్లు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సొసైటీకి సంబధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, ఉన్నం వెంకటేశ్వర్లు, మేకల మాల్యాద్రి, రావూరి వేణు, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణు, జొన్నలగడ్డ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం ప్రారంభానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న షమీమ్

కావలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి (మహిళల ఉచిత బస్సు ప్రయాణం) ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారిణి ఎస్‌కే షమీమ్ తెలిపారు. బుధవారం ఆమె కావలి డిపోను సందర్శించి అధికారులు, సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం దినోత్సవం రోజున ఈ పథకాన్ని కావలి డిపోలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రాంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డిపో మేనేజరు డీ.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పనారెడి, డీఈఈ ఎస్‌కే ఫయాజ్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర-ఆంధ్రపై అధికారులకు శిక్షణ

కొండాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్షర-ఆంధ్ర కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చే విధానంపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మండలంలో 2600 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో మురళీధరరావు, ఏపీఎం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కావలి రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గుర్రంకొండ వెలుగు ఏపీఎం రజనిపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కావలి ఏపీఎం కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వెలుగు సిబ్బందిపై జరుగుతున్న దాడులకు నిరసనగా వెలుగు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కావలి క్లస్టర్‌లోని ఏపీఎంలు, సీసీలు బుధవారం వెలుగు కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి, బోగోలు, దగదర్తి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

బాలాజీసింగ్ కుటుంబానికి ఆర్థిక సాయం

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దగదర్తి డిప్యూటీ తహసీల్దారు బాలాజీసింగ్ కుటుంబానికి ఏపీఆర్ఎస్ఏ కావలి డివిజన్ బాధ్యులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి సూచనల మేరకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేశారు. బాలాజీ సింగ్ ఉత్తర క్రియలు బుధవారం పట్టణంలోని కోఆపరేటివ్‌కాలనీలో వారి నివాసం వద్ద జరిగాయి, ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కావలి డివిజన్ బాధ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి బాలాజీ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే ఇంటూరికి పీఏసీఎస్ చైర్మన్ల సన్మానం



ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్‌లు

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లకు రాష్ట్రప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలలో చైర్మన్లుగా నియమితులైన టీడీపీ నేతలు బుధవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుడ్లూరు పీఏసీఎస్ చైర్మన్‌గా దామా వెంకటేశ్వర్లు, పోకూరు పీఏసీఎస్ చైర్మన్ గట్టమనేని లక్ష్మీ నరసింహం, దారకానిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా నరాల మాలకొండారెడ్డిలు ఎమ్మెల్యేను కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎంపికైన పీఏసీఎస్ చైర్మన్లను సత్కరించారు. వారివెంట త్రిసభ్య కమిటీల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను స్థానిక బీజేపీ నేతలు కోరారు. ఆపార్టీ బోగోలు మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్ యాదవ్‌ల ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు నెల్లూరుకు తరలి వెళ్లి జిల్లా పర్యటనకు వచ్చిన మాధవ్‌ను కలిశారు. బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి చేందేలా చూడాలని కోరుతూ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గోవిందరాజులు, బాలసుబ్రహ్మణ్యం, సూరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● **కందుకూరు :** రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నెల్లూరు పర్యటనలో పాల్గొనేందుకు కందుకూరు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలి వెళ్లారు. ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు నేతృత్వంలో అన్ని మండలాల అధ్యక్షులు, వివిధ కమిటీల బాధ్యులు, ముఖ్య కార్యకర్తలు ప్రత్యేక బస్సులో నెల్లూరు తరలి వెళ్లారు.

● కావలి(టౌన్) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరులో జరిగిన సారధ్యం సభకు బీజేపీ ఒకటవ, రెండవ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో కావలి నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. అయితే వంద మందిలోపే తరలివెళ్లడంలో పార్టీలో లుకలుకలు బయటపడుతున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



ధర్నాలో మాట్లాడుతున్న చెంచయ్య

కావలి(టౌన్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చెంచయ్య పేర్కొన్నారు. కావలి డిపో వద్ద రెండవ రోజు బుధవారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ నిర్వీర్యమయ్యేలా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు జీవో ప్రకారం పిల్లల సంరక్షణ శెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శాఖ అధ్యక్ష కార్యదర్శి పీవీ రావు, టీఆర్ఎన్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి అబ్దుల్ కలాం, మీర్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ న్యాయనిర్ణేతగా కలిగిరి వాసి



గోసాల మహేష్

కలిగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువ ఆంధ్రకబడ్డీ సీజన్-1 న్యాయనిర్ణేత (రెఫరీ)గా కలిగిరికి చెందిన గోసాల మహేష్ ఎంపికయ్యాడు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలోని చెన్నుపాటి రామయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగే కబడ్డీ పోటీలకు రెఫరీగా వ్యవహరించే అవకాశం తనకు కల్పించిన ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, రెఫరీస్‌బోర్డ్ చైర్మన్ బీ.మురళీకుమార్‌లకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు మహేష్‌కు అభినందనలు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కొండాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పత్తిచేనులో పశువులమేత కొరకు వెళ్లిన యారవ లక్ష్మమ్మ కళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు కారంకొట్టి సుమారు నాలుగున్నర సవర్ల బంగారు గొలుసు అపహరించుకుని వెళ్లిన ఘటన మండలంలోని గరిమెనపెంట పంచాయతీ చల్లావారిపల్లిలో బుధవారం జరిగింది. బంగారు గొలుసు విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జీ.మాల్యాద్రి గ్రామానికి వెళ్లి విచారించి ఇద్దరు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టినట్టు సమాచారం.

క్షేత్రస్థాయిలో ప్రచారం చేయండి

(5వ పేజీ తరువాయి)

జరిగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలు ఉంటాయని నాయకులు, కార్యకర్తలు వాటిని ప్రజలకు తెలియజేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో ఎంతోమంది ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారని, వారి స్ఫూర్తితో పార్టీని ముందుకు నడిపించాలని కోరారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి ప్రత్యేక స్థానాలు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, వాటిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కూటమిలో నామినేటెడ్ పోస్టులు బీజేపీకి గణనీయంగా పెరిగాయని, మరింతగా పెరగాలంటే కార్యకర్తలు ప్రజా నాయకులుగా మారాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో నెల్లూరుకు విమానాశ్రయం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకులు కూడా కార్యకర్తలకు అండగా నిలవాలని అన్నారు. సాయంత్రం ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో స్వర్ణకారులతో సమావేశమై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, రాజేశ్వరి, కమల, విల్సన్, భరత్‌కుమార్, రఘునాథరాజు, దయాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీ4తోనే పేదరిక నిర్మూలన



విలేకరులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి

- విదేశాల్లో ఉన్న స్నేహితులను భాగస్వామ్యం చేస్తా
- గంజాయి మత్తు నుంచి యువతను మేల్కొలుపుతాం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనతో పుట్టుకువచ్చిన పీ4 ద్వారా పేదరిక నిర్మూలనతోపాటు అభివృద్ధిని పెద్దఎత్తున చేసుకునే అవకాశం ఏర్పడిందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి తెలిపారు. బుధవారం నుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ, విదేశాల్లో ఉన్న తన స్నేహితులందరినీ పీ4లో బాగస్వాములు చేస్తున్నానని, దీనిద్వారా పేదల జీవితాల్లో వెలుగునింపడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. అలాగే తన సతీమణి కోటంరెడ్డి సంధ్య మల్లెల సంజీవయ్య హైస్కూల్‌ను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ స్కూల్లో రూ.11లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, త్వరలో మరో రూ.50లక్షలతో పనులు చేయనున్నట్లు వివరించారు. నగరంలోని మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకోవాలని తన స్నేహితులను కోరామని, వారు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చంద్రబాబు కలలుకంటున్న స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోటంరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే జిల్లాను అభిమానిస్తూ ఐ లవ్ నెల్లూరు అనే నినాదాన్ని పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. గంజాయి మత్తుకు బానిసైన యువతకు అవగాహన కల్పించి, సరైన మార్గంలో నడిపించేందుకు రాష్ట్రంలోనే ప్రప్రథంగా నుడా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆనం వివేకానందరెడ్డి పార్కులో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతా ర్యాలీ

- 200 ట్రాక్టర్లతో 15 కిలోమీటర్ల మేర పెద్దఎత్తున ర్యాలీ



ఉదయగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ రైతులు బుధవారం ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. దుత్తలూరు తహసీల్దారు కార్యాలయం నుంచి 167-బీజీ జాతీయ రహదారిపై సుమారు 200 ట్రాక్టర్లతో 15 కిలోమీటర్ల మేర ఉదయగిరి అగ్రికల్చర్ మార్కెటింగ్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబుయాదవ్, మాజీ పోలీస్ హౌసింగ్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డిలు టీడీపీ నాయకులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి

ఏఎంసీ కార్యాలయంలో కంభం విజయరామి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం పాలన సాగిస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యే క దృష్టిసారించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజక వర్గంలో 44 వేల మంది రైతులకు రూ.30.42 కోట్లు లబ్ధి చేకూరిం దన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి చైతన్య, బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం, రియాజ్, టీవీ రామారావు, మల్లం పాటి గురవయ్య నాయుడు, ఉండేలా గురవారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, తుమ్మల కిరణ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఊరి జనం భక్తితో కొలిచే ఆంజనేయ స్వామి ఆలయం.. పక్కనే కోనేరు.. ఆ సమీపంలోనే బొంతజెముడు పుల్లలతో మంట వేసుకుని... తుంబుర మీటుతూ.. 'ఓం నారాయణ.. ఆది నారాయణ' అంటూ తనదైన లోకంలో విహరించే ఓ ఆధ్యాత్మికవేత్త! తన వాక్కును వేదంగా భావించే కొందరు శిష్యులు... నమ్మకంతో తన వద్దకు వచ్చే భక్తులకు వేలిముద్రలు వేసి.. చీటీల రూపంలో ఇచ్చే ఆశీర్వాదం! ఇవీ.. గొలగమూడిలోని అవధూత వెంకయ్య స్వామి ఆధ్యాత్మిక చర్యలకు సంకేతాలు.




వెంకయ్యస్వామి ఆశ్రమ మందిరం

- 'అవధూత వెంకయ్య' నడయాడిన నేల
- అన్నార్తుల ఆకలి తీర్చే ఆధ్యాత్మిక క్షేత్రం
- తిరుమల తరహాలో అభివృద్ధి చేయడమే లక్ష్యం
- ఈ నెల 18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

'జ్ఞానముద్ర'ల గుడి..

గొలగమూడి!

వెంకటాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చేజర్ల మండలంలోని నాగులవెల్లటూరు గ్రామస్థులైన సోంపల్లి పెంచలయ్య, పిచ్చమ్మ దంపతులకు జన్మించిన వెంకయ్య మనిషిలోనే దేవుడుంటాడని రుజువు చేశారు. నామమాత్రపు చదువుతో సరిపెట్టుకున్న వెంకయ్య చిన్ననాటి నుంచే వ్యవసాయం చేస్తూ అందులో విజయం సాధించారు. వయసుతోపాటు ఆధ్యాత్మిక చింతనను కూడా పెంచుకున్న వెంకయ్య సామాన్యులకు అర్థం కాని రీతిలో మాట్లాడుతూ పిచ్చి వెంకయ్యగా పిలిపించుకున్నాడు. అవసాన దశలో నడవలేని స్థితికి చేరారు. ఆయన కోరిక మేరకు శిష్యులు స్వామిని కంచి, తిరువళ్లూరు, శ్రీరంగం, తిరుపతి తదితర క్షేత్రాలకు డోలీల ద్వారా తీసుకెళ్లారు. పలు పుణ్య క్షేత్రాలకు వెళ్లి తపమాచరించిన వెంకయ్య స్వామి చివరికి గొలగమూడి చేరారు.



మూడు రోజుల దాకా.. సమాధి చేయకుండా...

1982, ఆగస్టు 24న స్వామి వారు కాలధర్మం చేశారు. అయితే ఆయన శిష్యులు స్వామివారు యోగముద్రలో ఉన్నారని 3 రోజుల వరకు సమాధి చేయలేదు. అయితే శరీరం ఉబ్బడంతో సమాధి చేయక తప్పదని భావించిన శిష్యులు స్వామిదేహాన్ని తరలిస్తుండగా ముల్లు తగిలి రక్తం కారింది. దీంతో ఏం చేయాలో తెలియని శిష్యులు సమాధి చేయాలా, వద్దా అని రాసిన రెండు చీటీలను ఉంచి తీశారు. అయితే సమాధి చేయాలని చీటీ వచ్చింది. దీంతో తూర్పు వైపు తల ఉంచి సమాధి చేశారు.

నిత్యం వెలిగే పవిత్ర 'ధుని'

'అగ్నిగుండం కోటి లింగాల పూజ గదయ్యా..' అన్న స్వామి సూక్తిని అనుసరించి శిష్యులు వెంకయ్య సమాధి ముందు భాగాన 'ధుని' ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు భక్తులు ధునిలో బొంత జెముడు పుల్లలు, కొబ్బరి కాయలు వేసి ధుని ఆరిపోకుండా నిత్య పూజలు ఆచరిస్తున్నారు. స్వామి సమాధి దర్శనానికి ముందే ధుని చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీగా మారింది.

ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా!

ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా! అంటూ స్వామి ఎప్పుడూ చెబుతుండేవారు. కేవలం అన్నదానం ద్వారా మాత్రమే మనిషిని సంతృప్తిపరచగలమని బోధించేవారు. దీంతో భక్తు లు ఇచ్చే బియ్యం, పప్పులు, కూరగాయలతో ఆశ్రమ నిర్వాహకులు నిత్యం వేలా ది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు భోజనం చేయడానికి వీలు గా భక్తుల విరాళాలతో విశాలమైన డైనింగ్ హాలును నిర్మించారు.

పరివర్తనకు మార్గాలు.. స్వామి బోధనలు

వెంకయ్య స్వామి జీవించి ఉన్న రోజుల్లో చెప్పిన సూక్తులు గొప్ప పరివర్తనకు మార్గాలని భక్తుల విశ్వాసం. నిత్య జీవితంలో వాటిని ఆచరిస్తే మనిషి మహనీయుడిగా ఎదుగుతాడని చెప్పడంలో సందేహం లేదు. బాధలను ఆధ్యాత్మిక చింతనతో ఉతికేయడం చాకలి యోగమని, కోరికలను తెంచుకోవడం మంగలి యోగమని స్వామి నర్మగర్భంగా చెప్పేవారు. పావలా దొంగిలిస్తే రూపాయి పోతుందయ్యా.. అంటూ ఇతరుల సొమ్ము దొంగిలిస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో.. అత్యంత సులభంగా స్పష్టంగా చేశారు. ఆధ్యాత్మిక బావనకు దూరంగా పోవద్దని.. దారం తెగిపోకుండా చూసుకుంటే నీ బాగోగులు తాను చూస్తానని స్వామి భక్తులకు ప్రబోధించారు.

తిరుమల తరహాలో అభివృద్ధి

గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధి గుడిసె స్థాయి నుంచి నేడు 54 ఎకరాలకు చేరింది. తిరుమల తరహాలో ఇక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.200 కోట్లకుపైగా విలువ చేసే ఆస్తులు ఆలయానికి సమకూరాయి. ఆశ్రమ ఈవోగా విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పేద విద్యార్థులకు ఉచిత భోజనంతోపాటు ఓ పాఠశాలను నిర్మించారు. టాటా సంస్థ యాజమాన్యం సైతం ఈఓ విజ్ఞప్తి మేరకు రూ.కోటి రుపాయలు వెచ్చించి హాస్టల్ నిర్మించింది. అలాగే భక్తుల వసతి కోసం 270కిపైగా గదులను నిర్మించారు. ఆరు అతిథి గృహాలు, ఆర్ఓ ప్లాంట్లు, 4 డార్మెంటరీలు, కల్యాణమండపాలను సైతం నిర్మించారు. రూ.6 కోట్లతో ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించి వివిధ రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. వాటర్ స్టోరేజ్ ట్యాంకులను కూడా నిర్మించారు. ఆరాధనోత్సవం రోజు తెప్పోత్సవం కోసం రూ.లక్షలు వెచ్చించి ఆధునిక వసతులు కల్పించారు. ఆశ్రమ ప్రాంగణంలో ధ్యానమందిరాన్ని కూడా నిర్మించారు. సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. ఈవోగా బాలసుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టక రూ.7 కోట్లు ఉన్న ఆస్తుల విలువ నేడు 200 కోట్లకు చేరింది.

18 నుంచి ఆరాధనోత్సవాలు

ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. 18న ఉదయం సర్వభూపాల వాహన సేవ, రాత్రి కల్పవృక్ష వాహన, 19న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న ఉదయం హనుమంత, రాత్రి హంస, 21న ఉదయం చినశేషవాహనం, రాత్రి గజ వాహనం, 22న ఉదయం అశ్వ వాహనం, రాత్రి పెదశేష వాహనం, 23న ఉదయం సింహవాహనం, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిస్తామన్నారు. 24న ఉదయం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులచే స్వామికి పట్టువస్త్రాల సమర్పణ, ఆ తర్వాత రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచీ భక్తులు తరలి వస్తారు.

అక్రమంగా తరలుతున్న వేపకర్ర

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న వేపకర్రను రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంఘటన మంగళవారం రాత్రి వేంపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారులు ఇటీవల తమ ఇష్టానుసారంగా వేపకర్రను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రాత్రి సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా వేపకర్రను తరలిస్తుండడంతో విషయం తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు వీఆర్వో ఆంథోని బాబుకు సమాచారం అందించారు. దీంతో ఆయన మార్గ మధ్యంలోనే ఆ ట్రాక్టర్‌ను అడుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యడు. గ్రామస్థుల సహకారంతో ట్రాక్టర్‌ను తహసీల్దారు కార్యాలయానికి తరలిం చారు. కాగా, బుధవారం తహసీల్దారు హేమంత్ కుమార్ కార్యాలయానికి రాకపోవడంతో ఆ ట్రాక్టర్ ఆవరణలోనే ఉంది.



కార్యాలయానికి తరలించిన ట్రాక్టర్

పిచ్చికుక్క దాడిలో
ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక వీధిలో బుధవారం ఇద్ద రు చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేయ డంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వీధిలో అడుకుంటున్న వారిపై ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో వారికి కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కను తరిమికొట్టి అనంతరం వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. పట్టణంలో కుక్కల బెడద అధి కంగా ఉందని, పలువురు వాటి బారినపడి గాయాలపాలవుతున్నారని, ఇప్పటికైనా అధి కారులు స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- కాపాడిన పోలీసులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడు పంచాయతీ హుస్సేన్‌నగర్‌కు చెందిన కొమరగిరి శ్రీనివాసులు అనే వ్యక్తి తూర్పుబోయమడగల గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి తన భార్య మాట వినడం లేదని మనస్థాపం చెందాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు 112 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేసి స్విచ్చాఫ్ చేశాడు. దీంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ రఘు నాథ్ స్విగల్స్ ఆధారంగా సిబ్బందితో గాలింపు చేపట్టారు. చివరికి అలివేలు మంగాపురం గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో అతన్ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటసుబ్బయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సోమిరెడ్డితో రైతు సంఘాల నాయకుల భేటీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. వారు బుధవారం నెల్లూరులోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. 10 రోజుల్లో ఎడగారు పంట కోతలు ప్రారంభమవుతాయని, ధాన్యం కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన సోమిరెడ్డి రాష్ట్ర పౌరసఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో ఫోన్‌లో సంభాషించారు. జిల్లాలో రెండో పంట ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవా లని కోరారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతోనూ మాట్లాడి తగుచర్యలు చేపట్టాలని కోరుతామని రైతు నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షేక్ షానవాజ్, ఏవీఆర్ నాయుడు, వై శ్రీనివాసులురెడ్డి, పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు దారుణ హత్య

కత్తులతో విచక్షణ రహితంగా దాడి

నెల్లూరు(క్రైం) ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో పట్టపగలు అందరూ చూస్తుండగానే ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని కత్తులతో విచక్షణా రహితంగా హత్య చేశారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు... నగరంలోని సీఏఎం స్కూల్ ఎదురుగా కసాయి వీధిలో షేక్ లైక్(36), రేష్మ దంపతులు నివసిస్తున్నారు. వారికి రోషన్ జమీర్, రూమాన్ కుమారులు. లైక్ తన అన్న రఫీతో కలిసి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లైక్ వద్ద కోటమిట్టకు చెందిన నూరు పని చేస్తున్నాడు. ఇద్దరు మంచి స్నేహితులుగా ఉండేవారు. అయితే కొద్ది రోజుల క్రితం వారి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం లైక్ పాలప్యాకెట్ల కోసం బైక్‌పై అలంకార్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా నూరు, అతని స్నేహితుడు అడ్డుకుని కత్తులతో పొడవబోయారు. లైక్ బైక్‌ను వదిలేసి సమీపంలోని విక్టోరియా గార్డెన్ వీధిలోకి పరుగులు తీశాడు. దీంతో నిందితులు వెంబడించారు. అదే సమయంలో అటుగా వెళుతున్న లైక్ అన్న రఫీ విషయాన్ని గమనించి పెద్దగా కేకలు వేశాడు. ఇంతలో ఇద్దరు నిందితులు లైక్‌ను కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసి పరారయ్యారు. రఫీ అక్కడకు చేరుకునే లోపే లైక్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో లైక్ (ఫైల్)

మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టు మార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లైక్‌కు నగరంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో పరిచయం ఉండటంతో వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్న హరిత రాయబారులు



మీ వీధులు శుభ్రంగా ఉన్నాయా!?

- పారిశుధ్యం, మంచినీటి సరఫరా ఎలా ఉంది!?
- 'ఐవీఆర్ఎస్' సర్వేలో 95 శాతం మంది సమాధానం
- సోమలరేగడ పంచాయతీకి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం
- రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానం

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 'మీ గ్రామంలో వీధులు శుభ్రంగా ఉన్నాయా!? ఇంటింటికి హరిత రాయబారులు వచ్చి చెత్త, వ్యర్థాలు తెసుకెళుతున్నారా!? చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వాడుకలో ఉందా!? మురుగు కాలువలు శుభ్రంగా ఉన్నాయా!?' అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రజలకు ఫోన్లు వస్తున్నాయి. పారిశుధ్యంతోపాటు మంచినీటి సరఫరా తీరుపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఆరా తీస్తున్నారు. ప్రజాభిప్రాయాలను విశ్లేషించి పారిశుధ్యం, మంచినీటి సరఫరా బాగా లేని చోటకు వెళ్లాలని జిల్లాస్థాయి అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. అధికారుల పల్లెబాట పడుతుండటం, పారిశుధ్య నిర్వహణ బాగుందని ప్రజలు చెప్పాల్సి ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది స్వచ్ఛతపై శ్రద్ధ వహిస్తున్నారు.

ఉత్తమంగా సోమలరేగడ

జిల్లావ్యాప్తంగా 722 పంచాయతీలు ఉండగా, ఆగస్టులో 155 పంచా యతీల్లో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ జిల్లాస్థాయిలో ప్రథమం, రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానం సాధించింది. అలాగే మర్రిపాడు మండలం అల్లంపాడు పంచాయతీ చివరి స్థానంలో నిలిచింది. సోమలరేగడ పంచాయతీలో 309 నివాసాలున్నాయి. పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం, వీధులు శుభ్రం చేయించి పారిశుధ్య మెరుగుకు పెద్దపీట వేశారు. దీంతో ఈ నెల 5న ప్రభుత్వం నుంచి ఐవీఆర్ ఎస్ కాల్స్‌లో పారిశుధ్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా ప్రశ్నకు 90, వారానికి కనీసం రెండు సార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా ప్రశ్నకు 100 శాతం సమాధానం ఇచ్చారు. దీంతో సరాసరి 95 శాతం మంది ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వడంతో ఆ పంచాయతీకి ఈ ఘటన దక్కింది.

స్వచ్ఛతే లక్ష్యం

అందరి సహకారంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టి స్వచ్ఛతే లక్ష్యంగా పని చేస్తు న్నాం. మంచినీటి సమస్య తలెత్తకుండా చూడటంతోపాటు ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తున్నాం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సోమలరేగడ పంచాయతీ జిల్లాలో ప్రథమ, రాష్ట్రంలో నాల్గవ స్థానం సాధించడం అభినందనీయం.

- శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ నియామకం

నెల్లూరు (లీగల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది షేక్ అన్వర్ బాషాను నియ మిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. నెలకు 10 వేల రూపాయల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.12లక్షల బంగారం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైళ్లలో వరుసగా నేరాలకు పాల్పడుతూ పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను నెల్లూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిందితుడి వివరాలను డీఎస్పీ మురళీధర్ విలేకర్లకు వెల్లడించారు. నేరాల కట్టడిలో భాగంగా నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ తన సిబ్బంది, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో రైళ్లు, రైల్వే స్టేషన్లలో వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా జనశతాబ్ది రైలు నుంచి దిగి అనుమానాస్పదంగా వెళుతున్న హైదరాబాద్‌కు చెందిన కే గోవర్ధన్ అలియాస్ కార్తీక్ అర్విందొరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా కావలి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో రైళ్లలో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించాడు. దీంతో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.12 లక్షల విలువ చేసే 143 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జనరల్ టికెట్ తీసుకుని రైళ్లలో ప్రయాణిస్తూ ఏసీ బోగీల్లో ప్రయాణికులు నిద్రిస్తున్న సమయంలో బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులు అపహరిస్తుంటాడని రైల్వే డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే హైదరాబాద్, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విజయవాడల్లో పలు కేసులున్నాయని చెప్పారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌గౌడ్, హజరిలాల్ గుర్జార్, నెల్లూరు, గూడూరు రైల్వే ఎస్‌ఐలు హరిచందన, చెన్నకేశవ, సిబ్బంది దయాకర్, మణికంఠ, కిరణ్ తదితరులను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీధర్